అభినవ-సరస్వతి.

సంపుటము ౩౧ | ప్రమాది నామసంవత్సరము జ్యేష్ఠమాసము. | సంచిక ౩

కులస్త్రీలు

(సుదర్శిని)

...విద్య...కియత్త లేదు...పాకశాస్త్రము చదివినచో వంట సరిగాఁ జేయుట యలవడును. ఆవిద్య యాభాగమునకే యుపయోగించునుగాని యితరమునకుఁ బనికి రాదు. ఇట్లే యద్విషయకవిద్య నభ్యసించినఁ దద్జ్ఞానము కలుగుచుండును...స్త్రీవిద్య లోపించుటవలనఁ గలిగిన కీడేమియను ప్రశ్నకు సమాధానము మాఢ్యమనికదా చెప్ప వలసియున్నది?...సడియును జప్పుడును లేక తమచదువును వృద్ధిచేసికొని కాఁపురము మానవతు లెప్పుడును జేయుచునే యున్నారు. వారిని రెండవవా రెఱుఁగరు...గరల్సు స్కూళ్ళు మున్నగు బహిరంగకృషులవలన...స్త్రీవిద్యకుఁ బ్రోత్సాహము కలిగింపఁ బడుచున్నదనవచ్చును. చాలస్త్రీలు వ్రాయను జదువను నేర్చుటయే కాక విశేషించి సభలఁజేసియు నుపన్యాసములుచెప్పియుఁ బత్రికలు ప్రకటించియు గ్రంథములు రచించియుఁ బురుషులతో సమానముగా వ్యవహరించుచున్నారు. కావున...నిందువలన నేమాత్రము మేలు చేకూరినదో కీడు తొలఁగింపఁబడినదో చర్చించుకొనుటకుఁ దగిన స్థితిలోనికి వచ్చినాము. నూటికి 5 గురైనను నట్టి విద్యావతులు లేరనియు నందుచే దానివలనఁ గలిగిన ఫలము లిట్టివని యేమిచెప్పఁగలమనియు జనసామాన్య మంతయు నట్టివారైనచో దానిఫలము స్పష్టపడఁగలదనియుఁ గొందఱు చెప్పవత్తురు. మంచిదే కాని...కొంతమందియైనను విద్వాంసురాండ్రయినపుడు కొంతయైన దానిఫలము కనఁబడకుండునా ? ఇప్పటికిఁ గనఁబడనిది యిఁకమాత్ర మేమికనఁబడును ? కావున నేకొంచెమో కనఁబడుట విధాయకము. కాఁబట్టి యాఫలము లెట్టివో చర్చించుకొని యందేమాత్రము రుచితగిలినను భగీరథప్రయత్నముఁజేసి కాలేజీలను బెట్టించి సంపూర్ణాంగ్లేయయువతులను జేయుదము. ఏదీ ? ఇంతవఱకుఁ గలిగిన మే ళ్ళిట్టివని వ్రాయుటను గూర్చి యెంతపక్షపాతముగా వ్రాయుదమన్నను నెంతతడ వాలోచించినను బంక్తి నడచుటలేదు.

ముందుగ గమనించఁదగినది పాతివ్రత్యము. హిందూయువతి కంతకన్నఁ గావలసిన పరమధర్మ మింకొకటి లేదు. కావున నింతవఱ కభివృద్ధియైన స్త్రీవిద్య పాతివ్రత్యమున కెంత యుపకరించినదియు యోజింపవలసియున్నది. సలోకానుభవముగను నిపుణముగను బరికించినచోఁ బాతివ్రత్యమున కిది యించుకంతయు నుపయోగించుటలేదు సరేకదా! కొన్నికొన్ని చోటుల భంగకరముగానే కనఁబడుచున్నదని చెప్పుటకు సాహసించక తప్పకున్నది.

ఇట్లు చెప్పవలసివచ్చినందుకు మాకే లజ్జగానున్నది. విద్య యెన్నడైనను సదుపయోగ మగుట లేకపోవుఁగాక. పయిఁగాఁ జాతిపవిత్ర్యభంగమునకుఁగూడఁ దోడగుచున్న దాయని శంక తోఁచవచ్చును. కాని విద్యయనుదానికిఁ బ్రత్యేకించి యొకరూపము లేదుకనుక దానిఫల మెటుమాఱిన నటుమాఱవచ్చును. కార్తికేయాచార్యుఁ...డు చోరశాస్త్రమును రచించియున్నట్లు మృచ్ఛకటిక...మునఁ జెప్పఁబడియున్నది. ఆవిద్య చదువుకొన్న వాఁడు కడు నిపుణముగాఁ జౌర్యము చేయఁగలఁడు. ఇట్లే విద్యలన్నియు నాయా ప్రపంచకవిషయములలోని మెలఁకువలను జెప్పును. అంతే కాని చిత్తము నరికట్టి యోగ్యత నీయఁజాలవు.

భావకవిత్వము

(చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు)

భావప్రధానమగు కవిత్వమే భావకవిత్వమగు. ఈకవిత్వమందుఁ బ్రయోగించు పదము లన్నియు...సంస్కృతపదములే కాని మన కవి సంపూర్ణముగఁ దెలియుట దుర్లభము. కృష్ణ మున్నగు పత్రికలలో వాడెడి యాదర్శములు నాశయములు నెట్లో యట్లే వీని యర్థమును మాకుఁ దెలియదు. భావకవిత్వమనినంతమాత్రమునఁ బదుగురకుఁ దెలియనిచోఁ బ్రయోజనమేమి ? అంగటిలో నన్నియు నున్నవి. అల్లునినోట శనియున్నది యన్నట్లగును. "భావమే ప్రధానము, ఆభావము గూఢముగా నుండవలెననుట శ్రేష్ఠము. అట్టిభావమే వ్యంగ్యము. కవిత్వము వచనరూపముగఁ గాని పద్యరూపముగఁ గాని యుండవచ్చును. ఎవరినుద్దేశించి వ్రాయఁబడినదో వారికే యన్వయింపవలయునుగాని నన్నురమ్మన్నది నన్నురమ్మన్నదని పదుగురును దగులరాదు. భావప్రధానవాక్యములు కొంతవఱకుఁడి తదితరము కొంత చేరియుండవలెనుగాని తుట్టతుదవఱకు నొకటే యుండరాదు. వసుచరిత్రయందలి కమనీయద్యుతిధామమా విమల ముక్తాదామమా యను పద్యమునందు భావము గర్భితమైయున్నది. ఏదైనను రసము తన్మయత్వము గలుగఁజేయున ట్లుండవలెను. ఔచితి యుంట మఱింతమంచిది. పెద్దన కవిత్వమందుకంటె నెక్కువ యౌచితి గలదా ? మనుచరిత్రయందుఁ బ్రవరాఖ్యునితో సంభాషించునెడ వరూథిని "ఆనందో బ్రహ్మ మటన్న ప్రాఁజదువు సంతర్బుద్ధి నూహింపుమా"అని యనెను. "ఆనందో బ్రహ్మ" మనునది వేదవాక్యము, భోగపుస్త్రీ వేదము నెట్లుపఠింపఁజాలినది ? ఔచితికి భంగములేదా"అని తలంపవచ్చును. కాని యట్లు కాదు. వరూథిని నివసించెడిది స్వర్గలోకము. అచట నధికముగ బ్రాహ్మణులతోడనే దానికి సాంగత్యము. కావున నౌచితి భంగము గాదని నాతలంపు. నేఁటి భావకవిత్వము 'గూటిచిలకేదిరా చిన్నన్నా' లాగున నెళ్ళుచున్నది. అర్థముఁ జెప్పలేము. ఇది యొక పరిభాష. సైన్సులోను వైద్యములోను నెటులో యటులే నేఁటి భావకవిత్వమందును నీపరిభాషముక్కలు పడుచుండును. యెవ్వెచదివినంతమాత్రమున వైద్యగ్రంథములలోని పదములు తెలియఁజాలవు.

భావకవిత్వ మెచ్చటఁ జూచిననచ్చటనే కలదు. మన దొడ్డియందలి మొక్కల ప్రభావము మనకుఁ దెలియదు. వైద్యుఁడు మనదొడ్డిలోనే సర్వౌషధముల వెదకఁగలఁడు.

ప్రతిపుస్తకమందును నీభావకవిత గాన్పింపఁగలదు. కాని పూర్వు లీకవితకు శీర్షిక పెట్టలేదు. 'కుందనమువంటి మేను మధ్యందినాతపోష్మహతిఁ గందె, వడదాఁకె నొప్పు లొలుకు వదన'మని వరూధిని బ్రాహ్మణునితోఁ బలికెను. ఆపద్యములో భావకవిత్వ మిమిడియున్నది. సామాన్యముగ మగవారింటలేనపుడు నూతను లెవరైన మనయింటికి వచ్చినచో నాడువా రర్ఘ్యపాద్యాదులచే సత్కరించి కుశలప్రశ్నలడిగెదరు కాని మీ తళతళలాడు దేహము కందెను, మీముద్దులుగులుకు మోము వడదాకె నని యందురా? అట్లనుటలోఁ బెద్దనగా రెంతభావ మిముడ్చవలెనో యంతయు నింపి నిను నేఁ గామించు చున్నాననను నభిప్రాయమును వెల్లడిసేసెను. అది వ్యంగ్యముగఁ దెలిపెను. ఇదియు భావకవిత్వమే. ఇట్టికవిత యెల్లెడఁ గలదు. భావకవిత్వము నారంభించినవారి యుద్దేశము మంచిదే కాని దాని నితరు లెంతవఱకు నిర్వర్తించుచున్నారో యనునది విచారణీయము. పూర్వకవు లిప్పటి భావకవిత్వ మంగీకరింతురని చెప్పఁజాలము. గిడుగు రామమూర్తిపంతులుగారి భాషనుగూడ నే నెదుర్కొనలేదు. వారివారి యిష్టము. భాష నుద్ధరింతమని బయలుదేఱెనఁ బరమేష్టమే. ఎవరువద్దన్నారు? అస్పృశ్యతనుగూర్చి నాయభిప్రాయ మడిగినారు. దానిలో లాభమున్నదని యన్న వద్దన్నామా? వారి పంక్తిని భోజనముచేసెదము. బాంధవ్యాలు చేసెదము. కాని మేముమాత్ర మితరుల కస్పృశ్యత మానవలసినదని ప్రచారముచేయలేము. కాలమునుబట్టియు నవసరమునుబట్టియు నస్పృశ్యతానివారణము కావలసినదని యందురు. అవశ్యము చేయవలసినదే. కాని ప్రస్తుతమువచ్చెడి భావకవిత్వము ప్రజల నెంతవఱకు రంజింపఁజేయుననను విషయము వేఱు. భావకవిత్వమందు భాష యెట్లుండవలెనను విషయము చాలపెద్ద. ఆయాపాత్రలకు స్వాభావికమగు భాషలో వ్రాయవలయుననుటయు వివాదాంశమే. శ్రీరాముఁ డేభాషలో ముచ్చటించెనో నిర్ణయించు టెటులు? ఇఁక నెంకిపాటలవిషయమై సుబ్బారావుగారు యోగ్యతాపత్రి మీవలసినదిగ నన్నుఁ గోరిరి. కడుపులో సెయ్యొట్టి కలనేసినాదీ మున్నగు పదములు వ్యంగ్యపూరితముగ మంచియభిప్రాయమును దెల్పు పట్టులు చాలఁగలవు. ఒక్కొకచో వ్యాకరణదోషములనుగూడ సరకుచేయక పోవచ్చును. జగమేలే పరమాత్మా యెవరితో మొరలిడుదునను త్యాగయ్యగారు జగమేలెడి యని యనఁ జాలకుండెనా?

గాయకులకు వైద్యులకు నట్టిదోషములు గట్టరాదు. చాకలిమంగలివారు మాటలాడుకొను మాటలలోనే సుబ్బారావుగారు వ్రాసిరి. కవిత్వమునకుఁ బ్రధానవిషయమేమి? కవి రసమునకు భంజకమైన విషయమును వదలివేయవలెను. రసముకొఱకుఁ గవి జనించెను గాని యితిహాసముకొఱకుఁ గాదు. కవిత్వములో సామాన్యనాయికానాయకుల ప్రవర్తనము వదలుకొనవలెను. వారివల్లనుండి గ్రహింపఁదగిన నీతి లేదు. కావ్యము నీతిని బోధించుచున్నది. ఆర్యులు సత్కులజులు మహారాజులు మున్నగు వారినే యాదర్శప్రాయులుగఁ దీసికొనవలెను. చాకలిమంగలి నాయికానాయకులవలన నేర్చుకొనఁదగిన దేమిగలదు? తిర్యక్కులయందు మ్లేచ్ఛులయందు నుండు రసము రసముకాదు. రసమువలె నున్నను రసాభాసము. ఉప్పులేకుండ విస్తరిలో వడ్డించరాదు కాని యటులని విస్తరినిండ నుప్పుఁజల్లినఁ దినఁగలమా? ఎంకిపాటలలో మొదటినుంచి

చివరవఱకు నీ రసాభాసము గలదు. పశుప్రాయుల శృంగార మెంతచక్కగ వర్ణించినను బాగుగ నుండదు. దేశభాషయందలి దోషములను బోఁగొట్టుటకు వ్యాకరణమాదిగాఁగల కట్టుదిట్టములను గావించిరి. కొన్నివేళలమాత్రము స్వదేశభాషను వాడిన దోషము లేదనిరి. కాని తుట్టతుదవఱకు గ్రంథమంతయు నిట్టిభాషలో వ్రాయుట రసాభాస. కవిత్వమువలన ఫలమేమి ? వేదములు రాజాజ్ఞవలె విధించును. పురాణములు మిత్రబోధ గావించును. కావ్యములు భార్యవలె లాలించును. కానఁ గావ్యము లుండితీరవలెను. కాని కవిత్వమందుఁ గొన్ని శాస్త్రనియమముల ననుసరింపఁదగును. ఎచ్చటనైన నుండ నగునుగాని సర్వత్ర రసాభాసగా నుండరాదు.

పత్రికానిర్వహణము

(శ్రీనివాసదీక్షితులు)

...పత్రికాసంపాదకుల స్థితిగతులు చిత్రముగా నున్నవి...పత్రికానిర్వాహకులు తాముపడుచున్న కష్టములకుఁ దగిన భృతి నార్జించుకొనలేక నే పోవుచున్నారు...వీరు తమ జీవితసర్వస్వమును శక్తియుక్తులను సాహసౌదార్యములను నితరుల క్షేమాప్తికై వినియోగింతురు. కాని సంఘము వీరిని గన్నెత్తి చూడనైనఁ జూడదు. అప్పటికిని నేసంఘమును నేకులమును నేమహోద్యమమును నేలోకోపకారకకార్యమును బత్రికాధిపతుల సాయము వొందనిది లేదు. ప్రజాహితమునందలి ప్రత్యంశమును బత్రికానిర్వాహకులపై నెక్కువగా నాధారపడియున్నదనుట యతిశయోక్తి కానేరదు. కేవలము లోకవార్తలను బ్రచురించుటయే కాదు పత్రికలుచేయుచున్న పని. సంఘములోఁగాని జాతియందుఁగాని నిస్సహాయులై పతితులగుటకు సిద్ధముగానున్నవారి గోడును బ్రజలకుఁ దెలియఁజేసి వారి యాపదలఁ బాపుటకుఁ బత్రికలే దిక్కు ... స్వాతంత్ర్యమును హక్కులను నిలువఁబెట్టుటకు వారే పూనుకొనవలయును ... మతిమంతులు ... పత్రికాధిపతుల యుపకారము నెఱింగి ... గౌరవింపఁదగియున్నది ... గుమాస్తాములుగా హైకోర్టులయందుఁ బ్రభుత్వకార్యనిర్వాహకశాఖలందు మహోన్నతోద్యోగములందున్నవారివఱకును జెమట యోడ్చి కాయకష్టమున 4 డబ్బులు సేకరించుకొను కూలివాని మొదలు సముద్రతీరమహాసౌధములఁ బండియుండు కోటీశ్వరులవఱకును గొద్దియో గొప్పయో ... పత్రికాధిపతులకు ఋణపడియున్నారు. ఒక్కసారి యాలోచించి మననము చేసికొన్నచో నందలి సత్యము గోచరింపఁగలదు. మనము ... పత్రికను జదివి దూరముగాఁ బాఱవేయుదుము. ... వ్యాసము లేమియు బాగుగా నుండ లేదని తిట్టిపోయుదుము ... ఇట్టి నెఱసు లెంచుటయే పనిగాఁ బెట్టుకొందుము కాని ... ఆపత్రికలోని ప్రత్యక్షరమును దన జీవితమునెల్లఁ బరులకై వినియోగించి పరుల క్షేమమే తన క్షేమము, పరుల సౌఖ్యమే తనసౌఖ్యముగా ... గడపుచు గడ్డిపరకంత లాభమేని ... పడయని సంఘసేవకుని తేజము ప్రకాశింపఁజేయుచున్నదని యెఱుంగము. మన దేశములో వార్తానిర్వహణము ... ఆశించుకొనియున్న వారిలో దేశనాయకులై ... ఉన్నవా రొకరిద్దరు దక్కఁ దక్కినవా రందఱు నిది యొక తాత్కాలి

కావశ్యకతగాఁ జూచుకొనుచుండిరే కాని యిందే నిలిచి తమ నైపుణ్యము నభివృద్ధిఁజేసి కొనుటకుఁ దగిన యుత్సాహము నొందఁజాలకున్నారు ... పత్రికానిర్వాహకుఁ...డు ...వాదోపవాదములకు మధ్యవర్తి ... ప్రవృత్తులను బరిశీలించి ... మార్గదర్శకమగు నట్లు వ్యాఖ్యానముచేయుచుఁ గర్తవ్యనిర్ణయము చేయకయే చేయఁగలుగు ప్రతిభావంతుఁడు. ఇట్టిపదవిలో నొక సంకుచితవాదతత్పరుఁడు నిలుచుటకుఁ దావులేదు. ... మతిమంతులు శీలవంతులు వాఙ్మయంతలుఁ బ్రజాభావగ్రహణదక్షులు సాహసోపేతులు నుదారభావశోభితులు ... పత్రికానిర్వహణమునకుఁ బూనుకొనవలయును ...

—♦ అందఱు, కవులేనా? ♦—

(కమ్మ)

ప్రతిదేశమును బ్రజ్ఞాధురీణుఁడును బ్రభావసంపన్నుఁడును నగు కవికొఱ కెదురు చూచుచుండును. అట్టిమహాకవి యుద్భవింపని దేశపుఁ జారిత్రము గాఢాంధకార మగ్నమై క్రాలుచుండును. అట్టిదేశచారిత్రము పవిత్రచారిత్రముగాఁ బరిగణింపఁబడదు. కవులే యుద్భవింపకుండినచోఁ గావ్యరచన మసంభవము. అందువలన దేశముయొక్కయు ... ప్రభువుయొక్కయుఁ దత్ప్రభువుచే నొనరింపఁబడిన వృత్తముయొక్కయు విశేషములఁ దెలిసికొనఁజాలక భూతలమంతయు గాఢాంధకారత్వ మందును. ...తత్త్వవేత్తయు ... మహాకవియు నగు వ్యాసుఁ డుద్భవింపకుండినచోఁ బంచమపవిత్రామ్నాయమగు ... భారతవీరుల చారిత్ర మెట్లు సంభవమగును? ... వాల్మీకిమహర్షి యే జననమొందనిచో ... శ్రీరామమూర్తి దివ్యచారిత్ర మెట్లు తెలిసికొనఁగలము? ప్రతి దేశవాసులను బూర్వుల ... ఆరాధించునట్లు పురికొల్పునవి మహాకవికృత సత్కావ్య రాజములే. ప్రతిదేశముయొక్కయు ... సాంఘికాధ్యాత్మికపరిజ్ఞానమును బెంపొందఁ జేయు సామర్థ్యము మహాకవి లేఖినియందు గుప్తమైయున్నది ... వేదవ్యాసవాల్మీక్యాది మహర్షు లెప్పుడుద్భవించిరో యెప్పుడు మరణమొందిరో కాని వారలచే రచి యింపఁబడిన పవిత్రగ్రంథములను ... ఏవోవిధముగఁ బఠింపకుండునట్టి ... హిందూ రక్తోద్భవుఁ డెవ్వఁడైన నుండునా? ఈపవిత్రకావ్యము లీభూమండలమునందలి యొక ... పల్లెయందునో పర్ణశాలయందునో రచియింపఁ బడినను బూర్వపశ్చిమార్ధగోళముల యందలి మహాపండితులును దత్త్వవేత్తలును జరిత్రకారులును దమ దేశభాషలలోనికిఁ బరివర్తనమొనర్చి తత్కావ్యరాజములయందలి హిందూసనాతనధర్మములను బాగుగా గ్రహించి మెచ్చుచుండుటలేదా? నిజమైన కవియే మహర్షి. కవిహృదయకుహరము నుండి నిశ్చలముగను నిష్కళంకముగను నిర్మలముగను సుధాప్రవాహమువలెఁ బొంగి పారలు నభిప్రాయసముదయమే కవిత్వము. అట్టి సదభిప్రాయసముదాయమును సరస కావ్యరచనమున వెలువరింపఁగల సామర్థ్యవంతుఁడే కవి. అతని వికసితహృదయారవిందమెప్పుడును జ్ఞానప్రభాభాసురమరందపూరితమై యధ్యాపకమధుకరముల నానందాబ్ధి నోలలాడించుచుండును. ప్రతిదేశముయొక్క యభ్యుదయమును గవిహస్తములయందే కలదు ... కావ్యరచనమునం దొకవిధమగు జాతిమతసాంఘికరాజకీయపరిణామములు

సూచింపఁబడుచుండును. వాని యభిప్రాయము లెప్పుడును మహత్తరములైనని... భగవంతు...ని తేజఃపుంజమును దివ్యప్రభావమును దన మృదుమధురపదగుంభనావిశేషముసం గడుగంభీరభావము లుట్టిపడునట్లు మానవకోటికి విశదీకరింపఁగలసామర్థ్యవంతుఁడే కవి ...చరాచరములయొక్కయు నాకసము ... నక్షత్రములు వాయువు సముద్రములు ... మున్నగువానియొక్కయు మహత్తరతత్త్వమును దన యోజనాసామర్థ్యమున బాగుగా గ్రహించి పవిత్రాక్షరముల విశదీకరింపఁగల మహాశయుఁడే కవి ... పదార్థములను భావములను నిపుణుఁడగు చిత్రకారుఁడు చిత్రపటలేఖనాకౌశలమునఁ బ్రదర్శింపఁగలఁడు. ప్రకృతిశాస్త్రజ్ఞుఁడు నిరంతరపరిశోధనావిశేషమున వస్తుసమ్మేళన మొనర్చి చూపఁగలఁడు. ఈమహత్తరవస్తుగుణాదికములను భావములను నత్యాశ్చర్యముగ నతిమనోహరముగ నతిస్వాభావికముగఁ దనపవిత్రాక్షరసముదాయమునఁ బొందుపఱచి ... పాఠకమహాశయులను యోజనానిమగ్నమానసులుగ నొనర్చి మోదవిషాదసముద్రముల ముంచి తేల్చుచు నాయా యవస్థల ననుభవింపఁజేయఁగల మహాసామర్థ్యవంతుఁ డొక్కకవియే. ... వాని లేఖినిచేఁ జిత్రింపఁబడనట్టి వస్తుజాల మావంతయును లేదు. ... సమస్త భావములను స్వలేఖినీసామర్థ్యమునఁ బ్రకటించు ప్రజ్ఞాధురీయుఁడే కవి. నిమీలితనేత్రుఁడును బ్రకంపితశరీరుఁడు నయి మహావేశముననున్న తటి నసంకల్పముగ నయాచితముగ వెలువడు భావప్రవాహమే కవిత్వము. అదియే ... నీతిబోధకము ... అట్టి మహనీయుని నీతిబోధక కావ్యరచనాకౌశలము పాఠకమహాశయుల నామంత్రణ మొనరించుచుండును ... ప్రకృతివైచిత్ర్యములను ... తా ననుభవించుటయే కాక మృదుమధురపదామ్నాయమున నధ్యాపకులనుగూడ ననుభవింపఁజేయఁగల మహత్తర ప్రభావము కవియందే లీనమైయున్నది ... కవి తన నిర్మలయశశ్చంద్రికలఁ బ్రకాశింపఁజేయుచు సకలజగమును మనోనేత్రముచే వీక్షించుచు ... రాజులను రారాజులను సకలమానవకోటిని దనశాసనమున కెల్లప్పుడును వశ్యులనుగాఁ జేయు ప్రభావవంతుఁడు ...

—♦ మూర్ఖుఁడు ♦—

(రాయచూరు బండారావుగారు)

మ కసులంగానక కానిపోనిపనులం గావించు చీ వెంతయున్
నను "నే నిచ్చట నుండియున్న నినుఁ బండంబెట్టి పైఁ ద్రొక్కుచుం
టిని"నం చంటివి దేహమున్ మఱచి. ఈనిందోక్తి కర్థంబుగన్
కనె దుండుండుము వే ఫలంబు నెగురంగాఁబోక యోమూర్ఖుఁడా!

క మధ్వమతస్థుఁడవయ్యును "మాధ్వుఁడవటరోరినీవు? మాదిగ" వనుచున్
మాధ్వుఁడనగు ననుఁదిట్టితి. మాధ్వుఁడ ఏవేలకావు మాదిగ మూర్ఖా!

తే. "మధ్వముద్రలుపెట్టిన మాధ్వుఁడగుదె"?
అనుచుఁబల్కితి. వద్వైతిజనుల నీవు

పిత స్మృతాహాస్యనంబలె వితగ నేను
తిట్టు. నిజ. మేను మాధ్వుఁడౌ లెట్టు మూర్ఖ ! 3

ఉ. “వైరవిఁజేసె దౌర ! ఇఁకఁ బైనను జూపెద నీదువైరవిన్
వైంవి వైర”వంచు వడిఁ బండ్లు పటుక్కునఁ గొర్కి పల్కి. తీ
వైరవి కాదు. నీకుఁదగు వైరవి యెయ్యదొ యయ్యదే యొగిన్
పేరిమిమై నొనర్పఁబడు. పేరెములెత్తకు రోరి మూర్ఖుఁడా ! 4

తే. “ఇంతవఱకును జూచితి నేను నిన్ను
గౌరవమ్మున, ఇక నటుల్ కలుగఁబోవ”
దనెడి నుడువులు నీయవి వినినయపుడె
ఊడిపడె నీవిడిన తుర యోరిమూర్ఖ ! 5

క. అన్నయుఁ దమ్ముండును చార్ మిన్నకయుండంగ నీవె మిడిసిపడియె? ది
క్కెన్నంగాఁబడుటకుఁగా సన్నయొనర్చెనుర నీదుస్వాంతము మూర్ఖా!

—♦ మహబూబు నగరమండలము ♦—

(శేషాద్రి రమణకవులు)

నిజాము రాష్ట్రమునందలి యాంధ్రమండలములలో నీమండల మొకటి. పూర్వ మీమండలమును బాలమూరను పేరుతో వ్యవహరించెడివారు. దాదాపుగా నీమండలము నంతయు నాంధ్రమండల మని చెప్పవచ్చును. ఆంధ్రసంస్థానము లీమండలమున విశేషించి కలవు. పూర్వ మీప్రాంతములను రాష్ట్రకూటులుఁ బశ్చిమచాళుక్యులుఁ గాకతీయులుఁ బద్మనాయకులుఁ బరిపాలించిరి. అనపోతనాయని సోదరుఁడగు మాదనాయకుని శాసన మీమండలము చివరనున్న యమరవాదిలో నుంట వెలమల విజృంభణమిట నతిశయించెననుటకుఁ దార్కాణము కాఁగలదు. తక్కినచోటులకంటె నీమండలమున ద్రవిడదేశాగతులగు వైష్ణవుల గృహములు చాలఁ గలవు. వీరివద్ద నపూర్వములగు సంస్కృతాంధ్రద్రవిడగ్రంథములు వందలకొలఁదిఁ గలవు. దాదాపుగా నీద్రవిడ వైష్ణవులాంధ్రులుగా మాఱిరి. గృహకృత్యములకుఁగూడ ద్రావిడము వ్యవహారభాషగా లేదు. పానుగల్లుప్రాంతమునందలి ద్రవిడవైష్ణవులు సర్వజ్ఞసింగభూపతికాలమున ద్రవిడదేశము నుండి వచ్చినటులఁ దెలుపు చరిత్రగ్రంథములు గలవు. వీరలవద్దఁగల కాగితములు పత్రములు విచారించినఁ జారిత్రకరహస్యములు కొన్ని లభింపవచ్చును. ఈమండలమునందుఁ బూర్వము కొణాదమువారు బుక్కపట్టణమువారుఁ బ్రిగడరాజువారు జింతగుంటవారు వఠ్ఠెమువారు మరింగంటివారుఁ గవులుగా నుండిరి. వారిగ్రంథములు కొలఁదిగా వంశీకులయింట నేఁటికి నిలిచియున్నవి. శాసనములలో నీశ్వరభట్టోపాధ్యాయుండను మహాకవి కానఁబడుచున్నాఁడు. ఆంధ్రములో నీయనకుఁగల పరిజ్ఞానము గ్రహింప వీలుకలుగ

లేదు. కాన గీర్వాణభాషలో నీతఁ డక్షుండుఁడు. బూదపూరులో నితఁడు రచించిన శాసనములు గద్యశ్లోకమయములు రెండు గలవు. అందలి కవితాకల్పన మనోహరముగా నుండి చిత్రాలంకారసమన్వితమయి యున్నది. ఈశ్వరభట్టోపాధ్యాయుఁడు మల్యాల చండదండాధీశ్వరుని కాలమునను నతని యనంతరము భార్యయగు కుప్పమాంబ కాలమునను విద్యాధికారిగా నుండెను. రంగనాథరామాయణ మీకాలమునందే రచింపఁబడెనని యూహింపవచ్చును.

కోనవంశములో బుద్ధారెడ్డి గన్నారెడ్డి ప్రముఖులు. వీ రుపయోగించిన ఫిరంగు లిపుడు గద్వాలలో నున్నవి. రామాలయమునకు సమర్పించిన శిలాపాత్రము ప్రమీస్తాపురములో మఠమునం దున్నది. ఈమండలములోనున్న దుర్గములలోఁ గొయ్యాలకొండ గణపురము దుర్గములు చూడఁదగినవి. ఆంధ్రవీరుల బలపరాక్రమములకుఁ దార్కాణముగా నున్నవి. వనపర్తి కోనదుర్గము. మొగిలిగిద్ద యాత్మకూరు శ్రీరంగాపురము లోనగు గ్రామములలోఁగల ద్రవిడవైష్ణవుల గృహములలోఁ దాళపత్రగ్రంథములు శోధించువారు లేక యుపయోగింపఁబడక నాశనస్థితిలోనికి వచ్చుచున్నవి. కొంతకాలముపేక్షించినచో నామరూపములు లేకపోవుననుట సత్యము. భాషాసేవకులు గ్రంథోద్ధరణమునకుఁ బూనుకొనుట యవసరము. ఈమండలములో మాతృభాష యాంధ్రమైనను రాజకీయభాషయగు నురుదుకాక మహారాష్ట్రము కన్నడముగూడ బాగుగా వ్యవహారములో నున్నవి. నారాయణపేట ప్రాంతములం దున్న యాంధ్రులకుఁ గొందఱ కాంధ్రము వ్రాయుటే రాదు. వారు వ్యాపారములు వ్యవహారములు గ్రంథపఠనము మహారాష్ట్రములో జరుపుచున్నారు. అచటఁగల గ్రంథాలయముగూడ మహారాష్ట్రగ్రంథములు మూడుపాళ్ళు కన్నడగ్రంథము లొకపాలుగ నుండి వ్రేళ్ళతో లెక్కింపఁదగినన్ని తెలుఁగుపుస్తకములతో నాంధ్రభాషాస్థితికిఁ దార్కాణముగా నున్నది... ఆంధ్రము వ్రాయుటయే కాక మాటలాడుటగూడ నెఱుఁగని యాంధ్రవైదికబ్రాహ్మణుఁడు నారాయణపేటప్రాంతముల... మధురమగు మాతృభాష నేర్చుకొనక కర్ణాటము నేర్చుకొన్నందుల కెంతయు విచారపడి యీప్రాంతములలోఁ దెలుఁగునకుఁ దావే లే దనెను... బూదపూరు కదంబపులి కందూరు వర్ధమానపురము కోడూరు గంగాపుర ముమ్రానది కలవకుర్తి మామిళ్ళపల్లి లోనగు గ్రామము లీమండలమునఁ జరిత్రప్రసిద్ధములైనవి. ఆయాగ్రామములలో నపూర్వములగు శిల్పములు నిర్మాణములు దుర్గములు దర్శనీయములుగా నున్నవి. ముఖ్యముగా గంగాపురమునుగురించి విపులముగాఁ దెలుపవలసియున్నది. గంగాపురము జటచర్ల రైలుస్టేసనునకు 4 మైళ్ళదూరములో రోడ్డుప్రక్క నున్నది. ఈగ్రామముననున్న వీరవిగ్రహములు శిలావిగ్రహములు శాసనములు సాధారణముగా నితరస్థలములలోఁ గానరావు.

ఇచట నపూర్వములగు 4 బౌద్ధస్తూపములు గలవు. ... ఈమండలములోని కొయ్యాలకొండలోఁ గాకితముల పరిశ్రమ జరుగుచున్నది. ఇచట దేశీయపరికరములతో ముతకకాగితములు చేయఁబడుచున్నవి. ఇతరస్థలములలో నీవృత్తి దాదాపు నశించినది. ఈమండలములోని మహబూబునగరు దేవరఖదరు నారాయణపేట లోనగు తావులలో గొప్ప సంతలు జరుగుచున్నవి. ఈసంతలలోఁ జక్కని గొంగడులు వివిధవర్ణములతో

నేసినవి యమ్మకమునకు వచ్చును. చక్కని నేతతో మంచి సన్నదనముతోఁ గానుప్పూరు శాలువలను మించియుండును. నాగరకర్నూలు ముక్తల యమరాబాదు ప్రాంతములలో గొంగడులు పెక్కు తెఱఁగుల నేయువారు కలరు ...

—♦ ఇంటిశత్రువులు ♦—

(భోగరాజు పట్టాభిసీతా రామయ్యగారు)

తే. ఇంటిలోని పోరు, ఇంతింతగాదయా విశ్వదాభిరామ! వినరవేమ!

...ఏదొంగనైనఁ బట్టవచ్చునుగాని యింటిదొంగను బట్టఁజాలమన్న సామెత నిజము. ఆరీతిగానే యేశత్రువునైనఁ బట్టి సంహరింపఁగలము గాని యింటిశత్రువును జయించుట కష్టము. సూర్యోదయము మొదలు రాత్రివఱకు సాయంకాలము మొదలరుణోదయమువఱకు మనలను బాధించు శత్రువుల సంఖ్య రోజురోజుకుఁ బెరుఁగుచున్నది...

సూర్యోదయమున లేచునప్పటి కిల్లంతయుఁ బందికొక్కులు త్రవ్వియుంచును. దొడ్డిలోఁ జెట్లపాదులు పెట్టుకొనినఁ గొఱికివేయును. ఒకయింటిలోనుండి మఱియొక యింటిలోనికి రాయబారాలు జరుపును. ధాన్యపు బస్తాలపై నాశలేదు. రేపు దంపించుకొను ధాన్య మీరోజున యెండఁబోసినఁ గుంచెఁడు పందికొక్కుల కర్పించవలసినదే. ఇవి మనయిండ్ల నేలక్రింద సొరంగాలు త్రవ్వి కోటలుకట్టుకొని వాని కెప్పుడు రెండు ద్వారములయినఁ బెట్టుకొని కాఁపురముచేయును. ఒకద్వారము మనకుఁ గనుపించునది రాళ్ళుపెట్టి పూడ్చిన మఱియొకద్వారమునుండి తప్పించుకొనిపోవును. మన మడ్డము వేసిన రాళ్ళు తేలికవైనఁ ద్రోసివేయును. బరువుగలవైన వానియడుగునుంచి త్రవ్వి క్రొత్తమార్గమును దొలుచును. ధాన్యపుఁ గొట్లకేకుద్వారబంధాలుఁ దలుపులు వీని కోఱల కాహుతులే. కిటికీ తలుపు లింక నాఁగనే యాఁగవు. బందరులోఁ బూర్వపు టిండ్లకుఁ గొట్లకుఁ బెంకుటూర్పు నేలను గజములోఁతునఁ గూర్చెడివారు. వీనివలన నిండ్లుఁ గొట్లుఁ బందికొక్కులకు వశముకాఁజాలవు. క్రొత్తగా గోడపెట్టునప్పుడీమధ్య... పందికొక్కుమార్గా లట్లే యుంచినాగము. దానివల్ల గోడ యంతయుఁ దొలచకుండ నుండునేమోయని. అయితే, వాని, ప్రయాణమునకుమాత్రము మార్గము వదలిన లాభములేదు. వాని కిరవుగూడ నేర్పఱుపవలె. ఈసారి గోడలుపెట్టునప్పుడీయేర్పాటుకూడఁ జేయవలసియుండున ట్లున్నది...

పిల్లులబాధ లోకులకుఁ దెలియనిదికాదు. ఈప్రక్కనుండి కొట్టిన నాప్రక్కనుండి వచ్చును. దొడ్డిలోకిఁ దఱిమిన సందు ద్వారమున వాకిటిలోనుండి ప్రవేశించును. ఇటు నటుఁ జూచుచుండ వడ్డించినవి స్తరిని ముట్టుకొనును. వెనుక ముందుఁ జూచిన నేతిగిన్నెలోని నెయ్యి పెరుగుగిన్నెలోనిపెరుగుఁ ద్రాఁగివేయును. సాధారణముగాఁ బిల్లులబాధకంటెఁ బిల్లిపిల్లల బాధ యెక్కువ. ఇవి జంటగాను మూడుగాను మనలను బాధించును. అదృష్టముచేతఁ బిల్లులలో ... తగాదా లున్నవి. మగపిల్లి మగపిల్లి పిల్లలను బ్రతుకనీయదు. తల కొఱికివేయును. ఆడకూనల నేమియు ననదు ... వెనుక నొకకథ చెప్పువారు. పిల్లి యరణ్యములోఁ దిరుగు జంతువనియు

నింటిలో నెలుకలయుఁ బందికొక్కులయు బాధ పడలేక యొక బ్రాహ్మణుఁడు పిల్లిని దేశములోకి రమ్మనఁగా నాపిల్లి "నే నరణ్యములో స్వేచ్ఛగానుండు దానను, మాంసభక్షకురాలను, నీవు శాకభక్షకుఁడవు, మీయిండ్లలో నెలుకలను బందికొక్కులను వేఁటాడి భుజించి నీశత్రువుల నివారింపుమనికదా నీకోరిక; సరే నేను గాని నాబిడ్డలుగాని యొకవేళ నీభోజనమును బాలువెన్న మీగడలను ముట్టుకొనిన నీవల్లనే నా కపాయమువచ్చునేమో"యని యన్నమీఁద బ్రాహ్మణుఁ డభయహస్తమిచ్చి పిల్లినిజంపుట బ్రహ్మహత్యతో సమానమనియు నాపాపము కాశికేఁబోయి పరిహారముపొందినను బోదనియుఁ జెప్పినాడఁట. అందుచేతనే పిల్లిని గొట్టుటకు మన యిండ్లలో నంతగా వెఱతురు ...

కుక్కలబాధ యింతంతయని చెప్ప వీలులేదు. వీధిలోఁ దిరిగెడి పిచ్చికుక్కలన్నియు నెండకాలములోఁ జల్లని చావళ్ళలోఁ జీకటిమూలల దాగి పరుండును. ఎన్ని సారులు కొట్టినను దిరిగి హాజరగును. ఎప్పుడు వీనికిఁ బిచ్చియెత్తునో తెలియదు. కొందఱిని గఱచినపిమ్మటనే గుర్తు తెలియును. అదృష్టముచేత నిప్పుడు ప్రతిజిల్లా యాస్పత్రిలోను బిచ్చికుక్కకాటు కింజెక్షనులు సిద్ధముగానుండుచున్నవి. పూర్వము పంజాబులోఁ గసాలికి బంపువాండ్రము. పిమ్మటఁ గూనూరుకుఁ బంపవలసివచ్చినది ...

ఇంటిలోని కత్యంతస్వతంత్రముగా వచ్చునవి పిచ్చుకలు. అలవాటుకొలఁది దగ్గఱకు వచ్చి బియ్యమువగైరా గింజలు భుజించును. కాని యెక్కడఁబట్టిన నక్కడ గూళ్ళుపెట్టుట వాని గ్రుడ్లకొఱకుఁ బాములు వచ్చుట సర్వసామాన్యము. డాబా యిండ్లలోఁ గడ్డీలకుఁ బైచప్పాకు దూలముకు మధ్యఁ జెక్కలుపెట్టకుండఁ గొందఱు లోభింతురు. ఈలోపమునుండి పిచ్చుకలవల్ల యావజ్జన్మశిక్షయే. అద్దాలు కనుపించినఁ బిచ్చుకలు వానిమీఁద వాలి తమ పాపను జూచుకొనుచుఁ డక్కుటిక్కుమని రోజెల్లఁ బొడుచుచునే యుండును. ఈయద్దాలన్నిటికి గుడ్డలుకట్టుట తప్ప వేఱుమార్గములేదు....

ఇఁక నెలుకలబాధ చెప్పఁదరమా ? ధాన్య మంతయుఁ గొఱికిపోయును. బస్తాలు కొట్టివేయును. పిండితో నతికించిన యట్టగల పుస్తకములున్నఁ దెల్లవాఱువఱకుఁ గొఱికిపోయును. బల్లసొరుగులలోఁ దూఱి కాగితాలను ముక్కలుముక్కలుగాఁ జేయును. పైనుంచి క్రింది కుడుకుడుకు నన్నములోనో చల్లపులుసుగంగాళములోనో పడును. ఒకసారి వేలూరుజైలులో గజమెత్తు గంగాళములోని యుడుకుచల్లపులుసు పాఱఁబోయవలసివచ్చినది. ధాన్యపుఁ గొట్లలో నెలుకలుచేయు నాగమును వర్ణింపఁజాలము. బట్టలకొట్టులలో వీనివలన జరుగు నపకారము జాస్తి. అన్నిటికన్న సూక్ష్మజీవుల కాకరములై ప్లేగువ్యాధిని మనుష్యులకు సంక్రమింపఁజేయుట కెలుకలే కారణములు. ప్లేగువచ్చెడి సమయమునకు ముందుగా నెలుకలు చచ్చిపడును. వెంటనే యాయిండ్లను ఖాళీచేసి యూరిబయటకు వెళ్ళిపోవలసియుండును.

ఎఱ్ఱచీమలవలనఁ బక్షివర్గములవలనను క్రిమికీటకములవలనను గనుపించని బాధ మనకుఁ గలుగును. ఇవి తిన్నబండారపుఁ బదార్థములను బట్టి మన ప్రాణములను దీసివేయును. నీళ్ళచిప్ప లడుగునఁ బెట్టి యందులో బీరువా కాళ్ళు నిలఁబెట్టిన నివి యందులోఁ దేలికగా నీఁదుకొని వెళ్ళిపోవును ...

చెదలు మన కత్యాశ్చర్యమయిన విరోధి. వానికి వెలుతురు గిట్టదు. లేకుతప్పఁ వానిముందఱ నేకట్టడయు నాఁగదు. గూడుకట్టుకొని దానిక్రింద నెంతెంతదూలాలనైన మనకుఁ దెలియకుండ దినివేయును. ఇంకఁ గాకితాలు బట్టలు దేవదారువుచెక్కలు మున్నగు సున్నితపువస్తువులు వానికి లెక్కా? చెదలును జంపుటకుఁ జెదలుగూడు కనిపెట్టవలెను. ఆగూడు గోడలో నడుగునఁ బునాదిలో నుండును. పైకిఁబెట్టిన పుట్టల నెన్నిసారులు తీసివేసినను నెన్నిసారులు రంధ్రములలోఁ గిరసనాయిలుగాని తారుగాని పోసినను బ్రయోజనములేదు. సారంగముదారినే గోడ త్రవ్వవలె. పునాదిలోకిఁ బోవలె. ఒకగోడ త్రవ్వినఁ బ్రక్కగోడ పునాదిలో కీగూడు పోయియుండవచ్చును. అప్పుడు ... ప్రక్కగోడగూడఁ బైనుండి క్రిందివఱకుఁ ద్రవ్వవలసియుండును. ఒకసారి యొక కలెక్టరు నాఫీసులో నొకచోట నీగూడును బట్టుటకు 180 రూపాయలు వెచ్చించి చివరకు నిరాశచెంది వదలివేయవలసివచ్చినది. గూడుదొరకినపు డందులో రాణిచీమ యుండును. దాని సంతతియే యీచెదలంతయు. అది పోయిన నిది పోవును.

అన్నిటికంటె నెక్కువబాధగలుగఁజేయునవి నల్లులు దోమలు. ఇవి రెండును నిశాచరులే. నల్లినిబట్టి సీసాలో వేసి ఆరుమాసము లుంచిన నది యెండి వరుగై యుండును. ఆనల్లి నొడలిమీఁద నెక్కించినఁ బావుగంటలో మనరక్తమును బీల్చి కడుపు నింపుకొని మరల సంసారముచేయును. నల్లిదాఁగిన ట్టేదొంగయు దాఁగలేఁడు. నవారు పట్టెమెలికలమధ్య దానికి మంచి యిరవు. పట్టెమంచపుఁ గూసములలోను లేఁకు కమ్మికి నవారుపట్టుకు మధ్యను నవి కాఁపురముచేయును. నల్లులను మనము నీళ్ళలో వేసియో నిప్పులో వేసియో చంపినను వాని యీపి గుడ్లు సామాన్యముగాఁ జావవు...చంపినామని యనుకొనుటయే కాని వాని గుడ్లు 10 రోజులలోఁ బెరఁగి పెద్దవయి తిరిగి సంచారము మొదలుపెట్టి మనలను బాధించును. కనుపించని నల్లిని గనిపెట్టుట కష్టమన్న నందఱు నొప్పుకొనవలసినదే. కనుపించిన నల్లినే పట్టలేము. ఒకవేళ మన చేతితోఁ బట్టుకొంటిమనుకొనుఁడు. దీనిని నేలమీఁదకు విడిచి చంపుదమనినఁ జేతిలోనుండి వదలినఁగదా! ఒక నవారే యక్కఱలేదు నల్లు లుండుటకు. జైళ్ళలో నిసుపమంచా లిత్తురు. వానినిండ నల్లులే. పరుపులకు వేసెడి టాకాలక్రింద నవి భద్రముగా దాఁగును. వేలూరుజైలులో నదివఱ కాడవాండ్రుండు హాలును మాకిచ్చెదమని చెప్పి చూచుకొనుఁడన్నారు. అక్కడకుఁ బోయిన గోడలవరుసను బారులు కట్టి పరుగెత్తుచున్నవి. జైళ్ళలో ఖైదీల కరుగులు కట్టెదరు పడుకొనుటకు. ఆయరుగులనిండ నల్లులే. ఆడఖైదీలను క్రొత్తజైలుకు మార్చుటవల్ల వీని కాహారము లేక బయటకు వెడలి వచ్చినవి.

ఇంకొకశత్రువు దోమ. సంగీతపుదోమ మలేరియాజ్వరమును గలుగఁజేయ దనియు మెల్లగా నిశ్శబ్దముగా వచ్చి కఱచు దోమయే చలిజ్వరపు సూక్ష్మజీవిని దన కొండిద్వారమున మన రక్తములోని కెక్కించుననియు శాస్త్రజ్ఞుల సువిచారితమగు నభిప్రాయము. బోదకాలుకూడ దోమకాటువల్ల వచ్చెడి రోగమే. ఇటీవల బస్తీలలో దోమల బాధ యమితమైనది. కొళాయినీళ్ళు బాగుగా సరఫరాచేయుటవల్లను నందలి మురుగు నీరు పోవుటకు మార్గము లేకుండుటచేతను దోమలు వృద్ధియగునని చెప్పుదురు. మురుగునీ

రెక్కడనున్న నక్కడ నివి పెరుఁగును. దోమతెర వేసికొన్న దోమలు కుట్టవుకాని కర్మముసాలక దానిలోఁ బెద్దరంధ్రము లుండిన వానినుండి ప్రవేశించిన దోమలు మాత్రము తెల్లవాఱులు మనలను బాధించును. కిరసనాయిలు పూసికొనిన దోమలు వాలవని చెప్పుదురు. ఇటీవలఁ జైనావత్తి కాల్చినఁగూడ రావని చెప్పుచున్నారు. దోమ తెరలోఁ బడుకొనిన సామాన్యముగాఁ దలనొప్పివచ్చును. దోమతెరలైనను సేశీత కాలమో యుపయోగించఁగలము. కాని యితరకాలములో ముఖ్యముగా వేసవికాలములో నాలుబైటఁగూడ నుపయోగింపఁజాలము.

ఇంక నీఁగలు పగటిశత్రువులు. ఈఁగ 15 రోజులలోఁ గొన్నిలక్షల గుడ్లు పెట్టునని చెప్పుదురు. ఇవి సాధారణముగాఁ బెంటకుప్పయున్నచోటులఁ బెరుఁగును. కలరా టైఫాయిడ్ బంకవిరేచనాలు వ్యాపింపఁజేయుట కీఁగలు కారణములు. ఇవి మలమూత్రములమీఁద వాలి తిరిగి యాహారపదార్థములమీఁద వాలుసరి కాదోషము వీని కంటి వ్యాధిని గలిగించును. ఫ్లిట్ పిచికారి చేసిన నీఁగ లప్పటికిమాత్రము పోవునుగాని యాఘాటు తగ్గఁగానే తిరిగి హాజరగును.

బొద్దీఁక లింటిశత్రువులలో కెల్ల నసహ్యమైన జాతివి. ఇవి యెక్కడ సందున్న నక్కడఁ బ్రవేశించి వస్తువులను బెంటతో నింపివేయును. ఒకసారి వేపుడుకూరలో బొద్దీఁక కాలుకూడ వేఁగి యొకరికి గొంతుకలో గుచ్చుకోఁగాఁ గష్టముమీఁదఁ దీసి చూచుసరికి దాని నిజస్వభావము తెలిసినది. ఒక చిన్నపెట్టెలో బొద్దీఁకలు ప్రవేశించిన వాని నేరెండుమూడైనను సరే బయటకుఁదోలుట యెంతకష్టమో యనుభవించిన వారికే తెలియవలెను. ఇవి గోడయలమరలలోను బల్లల సొరుగులలోను బుస్తకాల మధ్యను నిరవుచేసికొని బాధించును.

ఇంటిలోఁ గప్పలబాధ సామాన్యముగ నన్నిచోట్ల నుండకపోయినను నున్న చోటమాత్రమవి యెప్పు డన్నమువిస్తరిలోకి దూఁకునోయని భయముగానే యుండును. కప్పలు చిన్నచిన్న పురుగులను దినుచుండును. వానికొఱకవి మనభోజనపుఁ బీఁటల మధ్య వేఁటాడుచుండుట మన మెఱిఁగియున్నవిషయమే.

ఇంటికంటి దొడ్డి సామాన్యముగాఁ బట్టణములలోఁగూడ నుండును. ఆదొడ్లలో నేవో మొక్క మొక్క వేసికొనుట మన కందఱకు నలవాటు. జామచెట్టెన్నివేల కాయలు కాయునో చెప్పలేము. ఒక్కపండు కనులార జూతమనిన దుస్తరము. రామ చిలుక లేపాటిదోరకాయ యయినను సరే, కొఱికిపోయును. ఉడుతలబాధకూడఁ జెట్లకాయలవిషయములో నమితమే. సీతాఫలములను గాఁపుదలచేయుట చాల కష్టము. పసుపుకుపచ్చుసరికిఁ గొట్టివేయును. అలాగే సపోటాకాయలుకూడ మనకు దక్కుదనుక నమ్మకములేదు. పచ్చిబాదముకాయలకుఁగూడ సన్న రంధ్రముపెట్టి లోపలి పప్పును జమత్కారముగాఁ దీయు పిట్టలున్నవి.

గొంగళిపురుగుబాధ యెఱుఁగనివా రుండరు. ఏపుగా నెదిగిన దొండపాదు 4 రోజులలో ధ్వంసమయియుండును. ఎక్కడఁజూచిన గొంగళిపురుగును దానిగ్రుడ్లును. ఇంక మునగచెట్టు దొడ్డిలో నుండినఁ జెట్టుమొదలు కొమ్మలునంతయు నవి కప్పివేయును. గంగరావి చెట్టనిన గొంగళిపురుగునకు మహేష్టము. పారిజాతపు మొక్కలకును గొంగళిపురుగులకు నతిస్నేహమనుదమా విరోధమనుదమా తెలియకున్నది.

శ్రీమ త్ప్రమాథిసంవత్సరాదిదివసమున శ్రీశ్రీశ్రీ దేవిడీ రాజాస్థానమునఁ
గావింపఁబడినపంచాంగశ్రవణసమయమందుఁ దదాస్థానపండితుఁడు
వేమాన సూర్యప్రకాశకవిరాజుచే సమర్పింపఁబడిన

నవరత్నమాలిక.

శా. శ్రీవందారుపురందరాదిసుమనశ్శీర్షస్థమందారమా
లావిర్భూతమరందతుందిలమిళిందాక్రాంతపాదాబ్జుఁడై
దేవింగూడి చెలంగు శంకరుఁడు ప్రీతిం బ్రోవుతన్ నిన్ను నా
నావిద్వద్వరవర్ణనీయగుణసాంద్రా! శ్రీప్రసాదాధిపా! 1

మ. ఇదె యేతెంచెఁ బ్రమాథివత్సరము ధాత్రీశప్రజాసమ్మతా
భ్యుదయాపాదకమై లసత్కిసలపుష్పోద్యత్ఫలాటువ్రజా
స్పద నానాలతికారసాలమయి భాస్వద్రీతి నీ వెల్లసం
పదలం జెందెద వీశుభాబ్దమున దేవా! శ్రీప్రసాదాధిపా! 2

మ. పరమాయుష్య మనామయంబు సుఖముం బ్రజ్ఞావిశేషంబు భా
స్వరతేజంబును నవ్యకావ్యరచనాచాతుర్యముం గూర్చుచున్
కరుణం బ్రోవుత శంకరుండు నిను రంగత్కుందుకూర్యన్వయా
బ్ధి రమాసోదర! శ్రీప్రసాదవసుధాధీశా! సముద్యద్యశా! 3

చం. సదనమునందు లక్ష్మియును స్వాంతమునందు నగేంద్రపుత్రియున్
వదనమునందు వాణియు నివాసమొనర్చుచు నీకు నిత్య మ
భ్యుదయపరంపరల్ గొలుపు చేయుచు నుండుఁగాతఁ బ్రీతి నో
మదనసమానరూప! ద్విజమండలదీప! ప్రసాదభూమిపా! 4

శా. దేవా! దేవిడిరాజ్యలక్ష్మి యనురక్తిన్ నిత్యసత్యస్థితిన్
శ్రీవిభ్రాజితరీతిఁ దావక భుజాసింహాసనాసీనయై
ఠీవిం దా విలసిల్లుఁగాతఁ గవికోటిస్తుత్య నానార్థ వి
ద్యావిజ్ఞానదయాంచు ధీమణి! ప్రసాదక్షోణిపాలాగ్రణీ! 5

సీ. బృందారకాపగామందారకుందార
విందాబ్జములతోడ వియ్యమంది
శతపత్రశరగోత్రతతి శాత్రవసుపుత్ర
భవమిత్రజులతోడఁ బంతగించి
హరినందన గిరీశ హరిచందన నదీశ
చింతామణులతోడఁ జెలిమిసలిపి

ధరజాతనుజ శీతకరజాత పురుహూత
గురుఫణీంద్రులతోడఁ గూర్మి నెఱపి
వెలయుకీర్తియు రూపంబు వితరణంబు
బుద్ధియుం గల్గి వెల్గు నిన్ బ్రోచు శివుఁడు
శ్రీకరచరిత్ర! వేంకయాంబాకళత్ర!
సద్గుణకలాప! సూర్యప్రసాదభూప! 6

కం. సూర్యాదినవగ్రహము లా|వార్యోచ్చస్థలములందు వసియించి కృపా
ధుర్యులయి నీకు సకలై|శ్వర్యముల నొసంగుదురు ప్రసాదమహాశా!

కం. కృతికర్తవై వినూతన
కృతిభర్తవునై సమస్తకృతివినుతకళా
కృతివయి కృతపండితసు
త్కృతివయి యొసఁగుము ప్రసాదపృథ్వీనాథా! 8

ఉత్సాహ. మంగళంబు సకలసుకవిమండలప్రపోషణా!
మంగళం బశేషదుష్టమత్తశత్రుభీషణా!
మంగళము సుధాసమానమధురమంజుభాషణా!
మంగళంబు శ్రీప్రసాదనూనవేంద్రభూషణా! 9

ఉ. ఈనవరత్నమాలిక నహీనసువర్ణపదార్థసద్గుణ
శ్రీనిధిగా రచించి నృపశేఖర! నీకు నుగాదికానుకగా
జానుగ నే సమర్పణము సల్పితి దీనిఁ బరిగ్రహించి పెం
పూని సమస్తసంపదల నొందుము నీవు ప్రసాదభూవిభూ!. 10

— వార్తాపత్రికాపఠనమువలని లాభాలాభములు —

(పయిఁడిపాటి వెంకటాచలపతీశ్వరరావుగారు)

తే. వార్తయందు జగము వర్తిల్లుచున్నది.
అదియు లేనినాఁడ యఖిలజనులు
అంధకారమగ్నులౌదురు. కావున
వార్త నిర్వహింపవలయుఁ బతికి. (భారతము)

...వార్తాపత్రిక ప్రపంచపుష్పవనమునకు...వసంతమై నూతనశోభ నింపెస లారుచున్నది. ... నిరాఘాటముగ నిశ్శంకముగ జాతి మత విద్యా సాంఘిక వాఙ్మయ లోపముల విమర్శించియు నుత్తమనూతనమార్గములఁ జూపియు దేశమునకు మహోప కార మొనర్చుచు భాగ్యాభ్యుదయముల రాకకై బంగరుబాటవేయు జ్ఞానమూర్తి

పత్రిక. నానావిధ విద్యావిమర్శములను వివిధశాస్త్రరహస్యములను గళావైచిత్ర్యమును దెలియఁబఱచుచు సులభగ్రాహ్యముగ విస్తారభూమండలమున జరుగు నద్భుతకార్యముల నోర్పుతో నేర్పు వాగ్దేవత పత్రిక. రాజనీతిబోధించు నొజ్జయై సమర సమయములఁ బ్రభుత్వనౌక నద్వితీయసామర్థ్యాతిశయమున నడపు కర్ణధారి...యై కవి గాయక కృషిక వ్యాపారుల పాలి యదృష్టదేవతయై...జనించిన భూలోక కల్పవృక్షము పత్రిక...పత్రిక వివిధవిషయములఁ దెలియఁజేయుననుటందఱకుఁ దెలిసినదే. అది పాలకులశాసనములఁ బాలితులకును బాలితుల విన్నపములఁ బాలకులకును నెఱుకపఱచును. ప్రకటనలచే వ్యాపారము నభివృద్ధిసేయును. వివిధవ్యాపారమగ్నులగు ప్రజలకు వారి యభిరుచి కనువగు విషయము లెన్నియో తెల్పును. న్యాయవాది పత్రికలందు న్యాయస్థానముల తీర్పులఁ జూచును. వర్తకుఁడు బజాఱువెలలఁ బొడఁజూచి సంతుష్టి నొందును. గ్రంథకర్త నూతనగ్రంథప్రకటనలను వాఙ్మయవిషయములను నామూలాగ్రముగ గ్రహించి యానందించును. నిరుద్యోగి యుద్యోగమునకై ప్రకటనలన్నింటిని... చదువును...పూర్వ మధికారులు దమ కుద్యోగులు కావలెననియు నింతవేతన మిత్తుమనియుఁ బ్రకటించుచుండిరి. నేఁటి నిరుద్యోగులు తమ యోగ్యతలఁ దెలిపికొనుచు నెవరేని మమ్ముద్యోగమునకు నియమింతురాయని ప్రకటించుకొనుచున్నారు. మఱియు నయోమార్గాధికారులు యాతాయాతములగు ధూమశకటములమార్పుల నపుడపుడు ప్రకటించుచుందురు. ...పత్రికాపఠనమువలన సాధారణమగు నిట్టిలాభము లెన్నియో కలవు. ... క్షామచిహ్నములు గానఁబడునెడల ధాన్యసంగ్రహమున నప్రమత్తులై యుండఁ బ్రజల నియోగింపఁగలదు. మతవిషయములు మతకలహములు న్యాయస్థానముల తీర్పులు మున్నగునవి ... తెలుపఁగలదు. ప్రభుత్వమువారు ప్రకటించు శాసనములవలనను వానిపైఁగల ప్రజాభిప్రాయములవలనను బ్రభుత్వపరిస్థితిం గనుగొనవచ్చును. ఇందులకు వేఱుగ నుదాహరణ మొసఁగనక్కఱలేదు. ఇటీవల మన ప్రభుత్వమువారిచే నేర్పఱుపఁబడిన దేవాలయపు బిల్లునుగూర్చి జరిగిన చర్చోపచర్చలే సాక్ష్యమీయఁగలవు ... ఇట్లు దేశవ్యవహార సర్వస్వమును ... తెలిసికొననగుటచేతను దేశవ్యవహారము లన్నియుఁ బ్రజాభిప్రాయవిశేషములగుటచేతను బత్రికలు ప్రజాభిప్రాయ ప్రతిబింబము లనఁబడుచున్నవి ... రాజు ప్రజలకుఁ దన శాసనములఁ దెలియఁజేయుట కడుంగడు నావశ్యకము. ఆంగ్లేయులకు ముందు మనదేశము నేలుచుండిన మొగలాయీలును వారికంటె ముం దీదేశముఁ బాలించుచుండిన మౌర్యవంశస్థులును దమ శాసనాదుల సభల మూలమునఁ బ్రజలకుఁ దెలియఁజేయుచుండిరి. వారిక్రింద వార్తాహరు లుండెడివారు. వారే విదేశముల సంచరించి వివిధవిషయములఁ దెలిసికొని రాజుల కెఱుకపఱచుచుండిరి. అంతియ కాని మనదేశమున 18 వ శతాబ్దమునకుఁ బూర్వము పత్రిక లుండెడివని నుడువుటకుఁ బ్రబలనిదర్శనము గానరాదు. పత్రికాజన్మస్థాన మిటలీయనియు నాదేశపు ... జ్యూలియస్ సీజరునాఁటినుండి ... జరుగుచుండిన చర్చ లన్నియు ... పత్రిక మూలమున ... ప్రకటింపఁబడుచుండెననియుఁ దెలియుచున్నది. ... అమెరికాదేశమున నన్నిదేశములకంటె నధికసంఖ్యాకములగు పత్రికలు ప్రకటింపఁబడుచున్నవి ... ఎప్పు డే ... క్షణమున నేమి ఘటించునో యను నాతురత ప్రజలలో నధికమైనది.

వార్తదెలియని ప్రజ లంధకారమగ్నులు. దేశమంతయు సంక్షోభముగా నున్నప్పుడు శాంతముగ నన్ని విషయములను దెల్పు మిత్రు లెవ్వరు ? పత్రికయే ... పత్రిక వివిధ విషయములను దెల్పునది ... తెలుపుచున్నది. తెలుపఁగలరు. మతము ప్రభుత్వమున కంటె బలవత్తరము. మానవు నజ్ఞానముఁ బటాపంచలొనర్చి యాముష్మికఫలవృక్షమునకుఁ ద్రోవఁజూపు విద్యుత్కాంతి మతము. మతపీఠము మతమునకుఁగల సర్వశక్తులకును గేంద్రస్థానము. ప్రజల నాకర్షించుటయందు మతపీఠమున కద్వితీయశక్తి గలదు. ప్రజలకు మతమునం దాసక్తి మెండు. అట్లుండ నొకమతపీఠము వివిధప్రాంతముల నున్న యామతస్థులను జ్ఞానాన్వితులనుగా నొనర్చు టెట్లు ? పత్రికయే శరణ్యము. పత్రికాముఖమున మతగురువు లామతస్థులకుఁ దగు హితోపదేశ మిత్తురు. సంస్కారాదు లొనర్పవలసినచో నాపత్రికలందు సూచన లొసఁగఁబడుచున్నవి. వాని ననుసరించిన వివిధప్రాంతములనుండువా రామతసంస్కారముల నొనర్తురు. ఇట్లు పత్రికల సాధారముగఁ గొని స్వమతోద్ధరణమునకు సర్వప్రయత్నములను సల్పుచున్నారు...ఇట్లు పత్రికలు మతప్రచారమునందును మతచిహ్నరక్షణమందును బ్రజల కెంతయో సాయపడుచున్నవి...మతపీఠము ననంతరము జాతిని సముద్ధరింపఁగలుగునది పత్రికయే. కవిగాయకచిత్రకారోపన్యాసకాది దేశబాంధవహృదయమే పత్రిక...ప్రస్తుతకాలమున...ప్రజలును బ్రజాప్రతినిధులును నొక్కెడఁ జేరి దేశమున కత్యవసరములగు విషయములను జర్చించుచున్నారు...భారతదేశ మంతయు స్వాతంత్ర్యవాయుపూరితము...ఇదంతయుఁ బత్రికాప్రభావమే. పత్రిక స్వతంత్రమూర్తి. అది స్వాతంత్ర్యోపదేశ మొసఁగి దాస్యమునుండి ప్రజల విముక్తులఁగాఁ జేయును. స్వజాత్యుద్ధరణమునఁ బత్రికవలెఁ దోడ్పడున దెద్దియును లేదు...దేశము నభివృద్ధికిఁ దెచ్చుట కిది యొక యుత్తమసాధనము. మఱియు, మోసగాండ్రు చోరులు దేశద్రోహులు మొదలగువారిని నిరసించి సాధ్యమగు నంతవఱకు నట్టివారు బయలుదేఱకుండున ట్లొనర్చి మహోపకారము సేయుచున్నది ... పత్రిక యొక సంఘసంస్కర్త. కవులు హరికథకులు పూర్వము సంఘమును సంస్కరించుచుండిరి. వేణుగోపాలశతకముఁ జదివినచో సంఘసంస్కరణోద్దేశముననే లిఖింపఁబడె ననుట తెలియఁగలదు, కాని పత్రికలు వెలువడిన వెనుక నాకార్యము చాలభాగము... నిర్వహించుచున్నవి. పత్రికకు జాతిపై నెక్కు డధికారముగలదు. విపరీతాభిప్రాయములను బత్రికవలె నెవ్వరు నడఁచఁజాలరు పత్రిక సంఘదురాచారములను విమర్శించును. సంఘము నుద్ధరించును...కొన్ని పత్రికలు భాషనుగూడ సంస్కరించుచున్నవి ... విద్య జాతియొక్క ప్రాణము. ఏదేశమున విద్యావాయువు వీవకుండునో యాదేశము మృతప్రాయము. దేశ మంతయు విద్యాప్రచారము సేయుటకును విద్య నేర్చికొనఁ బ్రజలఁ బ్రోత్సహించుటకును నూతన విద్యావిధానము...ప్రవేశపెట్టుటకును బత్రికయే... కంకణముకట్టుకొనినది ... ఈపత్రికలు పూర్వాధునిక ... విద్యావిధానముఁగూర్చి చర్చించుచున్నవి ... పండితులు ... తమ యభిప్రాయములను ... ప్రకటించుచున్నారు. ...విద్యార్థులు నీపత్రికల మూలమున వివిధవిషయముల వా రెట్లు పఠించిన లాభదాయకమో తమయందుఁగలలోపము లెవ్వియో తెలిసికొని బాగుపడఁగలరు...

కృ:— దీనింగూర్చి మన యుపన్యాసమంజరియం దించుకంత వ్రాయఁబడియున్నది. చెప్పెద నాకర్ణింపుఁడు. మొదటిది విదేశపదార్థస్వీకరణము. ఇతరదేశముల వారు మన కవసరములగు వస్తుసమూహము నెల్ల సిద్ధపఱచి వానిని మనదేశము వారికి విక్రయించి మనడబ్బును నొవ్వకుండ లాగి ధనవంతులగు మనలను దరిద్రులఁ గావించుచున్నారు. ఆపదార్థములే మనదేశజను లొనరించిన దేశాంతరముల కడ్డులేక పోవుచున్న కోట్ల ధనము మనదేశముననే యుండి మనల ధనవంతులఁ గావింపఁగలదు. కనుక విదేశములవా రెల్లరును దాము దేశాంతరమందు సిద్ధపఱచిన పదార్థ మెట్టిదిగాని స్వీకరింపమని నిశ్చయవ్రతము పూనియున్నారు. ఈకారణముచేతనే విదేశీయపదార్థముగలవా రెవరును దమ దివాణమునకు రాఁగూడదని మన చక్రవర్తిగారి పట్టమహిషిగారు నిర్దేశించినారని విన్నాను. మనకుఁ బ్రత్తి కోట్లపుట్లు పండుచున్నది దీని విత్తనములు తీసి దూదిగ నొనర్చి మనము సీమవర్తకుల కమ్ముచున్నాము. దానిని వారు నూలుగ నొనర్చియు వస్త్రములు గావించియు మరల మనకే విక్రయించి మొదట దూదికైన వ్రియమంతయు మనవలననే లాగుచున్నారు. ఒక వస్త్రములకుఁగాను మన దేశీయులు సంవత్సరమున కఱువదికోట్లరూపాయ లితరదేశముల కంపుచున్నారు. అవి మనము నూలువడికి నేయించుకొనిన మనదేశము సంవత్సరమున కఱువది కోట్లరూపాయల నిలువ కలిగి యుండఁగలదు. ఇంతవివర మెందుకు? ప్రతి దినము సూర్యోదయాది యస్తమయమువఱకును మనము వాడుచుండు ప్రతి పదార్థముయొక్క పుట్టుకంగూర్చి విచారింపఁగడంగితిమేని మన కీవిషయమైన పూర్ణపాండిత్యము కలుగఁగలదు. ప్రతివిషయమును వివరించిచెప్పుట దుస్తరము. విచారించనిచ్ఛగలవారి కిక్కాలంబున నీవిషయము లెల్లఁ గరతలామలకములగును.

రెండవది యాభరణాధిక్యధారణము. దీనింగూర్చి మన మిదివఱకే చదివియున్నాము. ఇది మనము సమగ్రముగ నెఱిఁగిన యంశము. దీనిని మట్టుపఱచు యంత్రము మన మగువలవశమే కాని మగవారివశము కాదు. ఇది యెఱిఁగిన సుదతి యెవరేని యలంకారముల ధరింపక మన కగపడినచో మన మామె నెగాదిగఁ జూచి చనవొనరించి గుచ్చిగుచ్చి కారణము నడుగుచుందుము. చాటున నావిషయమునే గుసగుసలాడుచుందుము. ఎఱుఁగనివారైనచో గౌరవింపకుందుము. అట్టితరుణముల నెంతధైర్యశాలినియైనఁ జిన్నఁబుచ్చుకొనకుండఁ జాలదు. నెలగలసొమ్ములును సరిగచీరెలును ధరించినవార లరుదెంచినంతనే త్వరపడి మనము వారల కాసనప్రదానా ద్యుపచారము లొనరించెదము. నిర్మల దుకూలధారిణియు నిరస్తాలంకారయు నగు వరవర్ణినిం గాంచినపు డట్టుల వేగిరపడి గౌరవించునంతటి ధీశాలినులు మన యక్కలలో మిక్కిలి తక్కువ సంఖ్యగలవా రుందురని నానమ్మకము. తొడవులపని కంసాలివానిదియు వలువలపని సాలెవానిదియు నని మన మెఱుఁగుదుము. వీనిని మన కమర్చు మహాంజనము ద్రవ్యము. అట్టిద్రవ్యము నింకఁజేయుట కివి యర్కప్రకాశములని మన మెఱిఁగియుండవలెను. ఇది యెఱుఁగక దంభాడంబరసహితలగు వనితలం

గాంచి మనము భ్రమించి గౌరవించుచుందుము గాన మనవారలు పెక్కండ్రు గౌరవార్థమే సొమ్ముల సంగ్రహించి ధరించుటయుఁ గలుగుచున్నది. అధికాభరణముల ధరించువారిని స్వర్ణోపలవాహులని నిరసించు బుద్ధి మన చెలియల కలవడినప్పుడు మనదేశదారిద్ర్యము తొలఁగఁగలదని చెప్పనగును.

జగ:— మనము సొమ్ములు పెట్టుకొనిన మర్యాద కలుగుననియు నవి లేనివారి కది తొలఁగుననియు ననుచున్నావు కాని యట్లు జరుగఁగలదా?

కృ:— మీ కాసంశయ మేల? ఇందునుగుఱించి కథ యొక టేను వినియున్నాను చెప్పెద నాకర్ణింపుఁడు. ఒక కుటుంబమువారికి నలువురు కొడుకులు నిద్దఱు కూఁతులు నుండిరి. మొదట నీకుటుంబమువారు సామాన్యస్థితిమంతులై కొడుకు లెక్కివచ్చిన వెనుక భాగ్యవంతు లైరి. కూఁతు లిరువురిలో నొకరిత తొలికాన్పుబిడ్డయు రెండవయామె కడకాన్పుపట్టియు నైయుండిరి. పెద్దపిల్ల పెండ్లినాఁటికి వీరు సామాన్యదశయం దుండినందునఁ దమ కర్హమగు మనుము విచారించి యొసఁగిరి. కడగొట్టుపిల్ల పెండ్లినాఁటికి స్థితిగతులు మాఱినందునఁ గట్నముతో భాగ్యవంతుల కిచ్చిరి. ఇట్లుండ నాలుగవకుమారుని వివాహము తటస్థించెను. బీదకుటుంబినియగు పెద్దబిడ్డను రమ్మని కమ్మనంపి చిన్నకూఁతు నాహ్వానించి తీసికొనిరా నన్నగారి నంపిరి. తమకుఁ జేతనగు కట్నములును గానుకలును గొని యాబిడ్డ లిరువురును బెండ్లి కరుదెంచిరి. పేదరాలగు పెద్దబిడ్డ సామాన్యవసనంబుల ధరించి యలంకారవిశేషములు లేకయుండెను. ధనవంతురాలగు చిన్నబిడ్డ సరిగచీరెలు మెఱుఁగుసొమ్ములు ధరించియుండెను. ఉభయులు నొకసారిగనే పెండ్లియింటికిఁ జేరిరి. ఇంటివారి కెవరికిని బేదరాలగు పెద్దబిడ్డను బలుకరించుటకైనఁ దీరనంత సత్వరముగఁ జిన్నకొమరిత నాదరించి పరామరికలఁ గనిపెట్టుచుండిరి. ధనలోపము తనకిట్టి మన్ననలోపము కలిగించెనని తలంచి యొకటిరెండుదినము లుండి యామె వెళ్ళిపోయెను. అనంతరము 10 సం॥ లకు వీరియింట మరల నొక శుభకార్యము తటస్థించెను. స్థితిగతులు మాఱినవి. మిగుల యోగ్యతగల పెద్దబిడ్డసంసారము వృద్ధినొంది సిరిసంపదలచేఁ దులకింపుచుండెను. దంభాడంబరకలితులగు చిన్నబిడ్డయొక్కయుఁ దమయొక్కయు స్థితిగతులు తఱిగిపోయెను. తొల్లింటియ ట్లిప్పుడును గూఁతుండ్రి నిరువుర నాహ్వానమొనర్చిరి. మునుపు చిన్నకూఁతున కమర్చిన మన్ననలన్నియు నిపుడు జ్యేష్ఠపుత్రి కొదవింపసాగిరి. ఆమెయు నీమార్పునకు వింతపడి సంతసింపక యెప్పటియటుల నుండెను. అందఱును విందుభోజనపంక్తుల నలంకరించిరి. వెనుకటి పెండ్లినాఁడు మొదటిపంక్తిని స్థలమైన దొరకని పెద్దకూఁతు రిప్పు డగ్రస్థానమునఁ గూర్చుండఁబెట్టఁబడెను. ఆమె బిడ్డలును వేఱువేఱు పీఁటలపై నామె సరస నలంకరించిరి. చూచువారల కెల్లరకును ముదావహముగ నుండెను. వడ్డన లైనవి. పరిషేచనానంతర మెల్లరును సాపడ మొదలిడిరి. ఈమెయు నీమెపిల్లలును దమ యలంకారములఁ దీసి పీఁటలపై నుంచి

తాము తొలఁగి క్రిందఁగూర్చుండి యాయలంకారములకు నైవేద్యము పెట్ట మొదలిడిరి. అటనున్నవా రెల్లరును నీవిపరీతచర్యకు నెఱఁగుపడి చూచుచుండిరి. ఇంతలో గృహయజమానుఁడు వచ్చి యమ్మా ! ఇదియేమిపిచ్చ ? అనియడిగెను. పెద్దబిడ్డ నాయనా ! నేను 10 యేండ్లనాఁడు తమ్ముని వివాహమునకు వచ్చి నపు డేదినమునను దొలిపంక్తిని భోజనముచేయుటకు స్థలముకాని మీ మన్నన కాని దొరకకుండెను. ఇప్పు డందఱికంటెను నే నధికాదరణపాత్రురాల నైతిని. దీనికిఁ గారణభూతము లీ నగలని కనుగొని నాకిట్టి గౌరవ మాపాదింపఁగలిగిన వానిఁ బూజించుచున్నా నని చెప్పెను. ఆమాటలను విని యచటిజను లెల్లరును వింతసంతసము నొందిరి. తలిదండ్రులును సోదరులును సిగ్గుపడి మాఱుచెప్పలేక యూరకుండిరి చూచితిరా సొమ్ములు సామాన్యజనుల నెంతయాకర్షింపఁ గలవో ? ఇతరులదనుక నరుగనేల ? తలిదండ్రులును సోదరులు నే యెటులాద రించిరో చూడుఁడు. మతిమంతురాలుగనుక నోర్చి యామె వారికి జ్ఞానోదయ మొనరింపఁగలిగెను. సామాన్య లిట్టితరుణములఁ జింతిలి దానింగూడఁ దీయుట కుపాయాంతరము తెలియఁగనేరక సొమ్ము లధికముగ నుండవలెననియు సరిగచీరెల ధరింపవలెననియు విశ్వప్రయత్న మొనరించుచుఁ దపస్వినులుం బోలె రేయిం బవళ్ళు తదేకనిష్ఠాగరిష్ఠలై యవకాశముకలిగినపు డెల్లఁ బురుషుల బాధించుచుఁ గోరికల సాధించుకొనఁ దలంచుచుందురు. ఇట్టి కారణములచేతనే పలువురు గట్టివాయలై దిట్టతనమూని పలు నగలను వెలగల వలువలను ధరించి తమ గౌర వము నభివృద్ధి గావింప నెంచెదరు కాని యిది నిజమగు గౌరవమునకు భంగకార ణమని యెఱుఁగఁజాలరు. మన వనితాజనంబున మఱియొకలోప మగపడు చున్నది. ఒకరితె యేదియో యొకవిధమగు వలువ ధరించినను సొమ్ము పెట్టుకొని నను దమయాకారమున కట్టిచీరెగాని యలంకారముగాని సరిపడునా లేదా యను శంక మాని యలఁతికాలమున నెల్లరు నట్టిచీరెలను సొమ్ములను ధరించు చుందురు. కొందఱి కిట్టిమార్పు లతుకువెట్టిన ట్లుండుటయు మఱికొందఱియందు సౌందర్యహీనత సమకూర్చినట్లుండుటయు మనము చూచుచున్నాము. మన యాడువారి కీపాటి వివేచనాశక్తి లేకుండుటకు విద్యావిహీనతయే కారణము సుండీ. ఈయాభరణపిశాచాదరణముచే మన యిల్లు నొళ్ళు గుల్లగుటయే కాక సంసారస్థితియెల్లఁ గల్లయగుచు మానప్రాణము లాహరించు నెఱ యగుచున్నది. మనదేశమున నిపు డభివృద్ధినొందుచున్న కన్నపునేరములకును బందిపోటులకును స్త్రీశిశుహత్యలకును దఱుచుగ నీయాభరణమూల్యాపహరణాపేక్షయే కారణమని మన మందఱము నెఱుఁగుదుము.

సీతమ్మ:- నిజమేచుండీ. ఇల్లును గుల్ల యొళ్ళును గుల్ల యనిన జ్ఞాపకమువచ్చినది. మా పుట్టింటియూర శ్రీధరవారనియు నన్నమువారనియు నున్నారు. ఆరెండిండ్లలో నిద్ద ఱాడపిల్లలకు నా పెండ్లప్పుడే పెండ్లిం డ్లయినవి. వాండ్రును నేనును సావాస ముగా నాడుకొనుచునుండెడివాండ్రములే. శ్రీధరవారు కొంచెము తినఁ గుడువఁ గలవారు. మంచి సంప్రదాయము. అన్నమువారు మావంటివారే. నన్ను మీ

పంతులుగారి కిచ్చినప్పుడు మావాండ్రు మీచేతనైనంతమాత్ర మలంకారము పెట్టుఁడు, అప్పులుచేసి సంసారము చెడఁగొట్టుకోవద్దని విస్పష్టముగాఁ జెప్పి నారు. అందువల్లనే యింత కొంప గోడి చెడకుండఁ బట్టుకొని కూటికి గుడ్డకు నొకరికిఁ జేయిచాపకుండ నెట్టుకొని వచ్చుచున్నాము.

శ్రీధరవారు కొంచెము మంచిమనుము లాలోచించి ప్రతివారుఁ గట్నాలిమ్మని బెట్టుచేయుచు వచ్చినను నందుకు సమ్మతింపక మేమొకరివద్దఁ బుచ్చుకొనము, ఈయము, అని పట్టుపట్టి యోలి పుచ్చుకొన్నను నిచ్చినను దోషమేయని వాదించి చివర కెట్టులనైననేమి మంచి స్థితిమంతులకే యిచ్చినారు. వీరల్లునికి 116 దక్షిణగా నిచ్చిన వారు సొమ్ములకుఁగాను వేయిరూపాయలు చదివించి పిల్లకు మీయిష్టమువచ్చిన సొమ్ములు చేయింపుమన్నారు. ఆపిల్ల కప్పటికే చాలనగలు పుట్టింటివారే చేయించి పెట్టినందున నత్తవారి నడిగి యానెయ్యి రూపాయలకుఁ బొలముకొన్నారు. ఇది పదిపదియేనేండ్లనాఁటి మాట. ఇప్పు డాపొలము నాలుగైదువేలు చేయునఁట. మొన్న యాయనకొడుకు కీయూరికి వచ్చినప్పుడు నాతోఁ బ్రస్తావవశమున నన్నాఁడు. సంవత్సరానకు 300 రూపా యలు వచ్చుచున్నవఁట. ఆపిల్ల కాఁపురముచేయుచు నీడబ్బుపెట్టి యింకను బొలాలు కొనుచు వృద్ధిచేయుచున్నదఁట. మంచి తెలివికలదిలే. తనపిల్లలకు మంచిమంచి చొక్కాలు టోపీలు మగవారితోఁ జెప్పియుఁ జెప్పక తెప్పించు చున్నదఁట. వాండ్రపని యిప్పుడు వేసివేయకుండ నున్నది. ఈసంగతి యిట్లు న్నదా; - రెండవపిల్ల యన్నమువారి యమ్మాయియని చెప్పితినే - దానిపెండ్లి యప్పుడే యైనదా ? దాని పుట్టింటివారు కొసరికొసరి సొమ్ములు పెట్టించు కొన్నారు. ఆపెండ్లివారు స్థితిమంతులనిపించుకొనవలెనని డంబముగా వచ్చి విరివిగా సంభావనయిచ్చి యా 4 రోజులు వెలిఁగిపడ్డారు. సొమ్ములు 2 వేల రూపాయలవి పెట్టినారనియుఁ బిల్ల యదృష్టవంతురాలనియు నమ్మలక్క లంద ఱును జెప్పుకొన్నారు. అప్పటికి నాకుఁ బదేండ్లున్నవి. బాగుగా జ్ఞాపకమున్నది. తరువాత నేమైనదో విన్నారా ? శ్రావణమాసములోఁ బెండ్లియైనది. మార్గశిర ములో ముక్కోటినాఁడు గుడిలోకిఁ బోయి యాపిల్ల మందిలో నోరుతెఱచు కొని దేవుని జూచుచు నిలుచున్నది. ఎవరో పచ్చెసకాండ్రఁట. 5 వందలరూపా యల కంటె యంతలో మాయముచేసినారు. కత్తిరించి హరించినారనుకొన్నారు. అంతే. నాఁటికి నేఁటి కైపులేదు. ఏడ్చినారు. మొత్తుకొన్నారు. ఏమిచేసిన నేమి ? అయినదేమో యైనది. పోయినది దానిదారినే పోయినది. లేనిది మగల లేకయే పోయినది. తరువాతఁ గొన్నాళ్ళకే పట్టెడకుఁ జీల వదలుట; కొంచెము దూదియైనను బెట్టి త్రిప్పలేదుకాఁబోలును. ఆకొంచెము నాపిల్ల యెచ్చటనో కులికింపించినది. ఊరు నుహముఁ బెంటులు దిబ్బలు 10 రోజులదాఁక వెదకి విసిగి వదలిపెట్టి యూరకొన్నారు. ఏడాదిలోపలనే యీ 2 అనుభవాలును! అన్నము వారిపిల్ల యదృష్టవంతురాలన్న యమ్మలక్క లందఱు నప్పటికే యది పుట్టి దౌర్భాగ్యపుఁ బెద్దమ్మయని యనుచు వచ్చినారు.

తే. గీ. నీవు తెచ్చిన యపకీర్తి నిన్నుఁ గట్టి
కుడుపుటే కాక మమ్మును గూడముట్టు
తాఁ జెడినకోఁతి యుపవనరాజ మెల్ల
చెఱుచు ననియెడిసామ్యముఁ జెప్ప వినమె ? 97

సీ. లేక సంతతి మేము లేమురో ! కన్నట్టి
చెట్టుచెట్టుకు గుట్టగుట్ట కరసి
తిరిగి తిరిగి మ్రొక్క హరికృపచేఁ గొంత
వడికి నీతల్లిగర్భమునఁ బడితి
పడినది మొద (లుగాఁ గుడుపుపై రుచి) దప్పి
నడలు తొట్రిల మేను బడ(లుపడఁగ)
తొమ్మిదిమాసముల్ నెమ్మి నిట్టుల మోసి
కనిపెంచె నది. ఇట్లు మనిచినట్టి
తల్లిదండ్రులమే. మెప్పు నుల్లములను
కలుగు దేహిత్రుఁ, డిహపరాల్ చెలఁగుననుచు
ఓజ నానందజలనిధి నోలలాడ
మాదు సంతస మిప్పుడు మంటఁగలసె. 98

వ. కావున నోదుర్మతీ ! నీమూలంబున నేఁడు ప్రభాకరాన్వయం బపయశః కలితం బయ్యె. నీ కింతటినుండి సుకన్యకయను పేరు మాఱి కుకన్యకాభిధానంబు గల్పితం బగుం గావున నిఁక మత్కుమారి యనరా. దెవ్వరేనియు మీఁదెఱుంగక యిట్టి యకృత్యంబు లాచరించిరేని వార లధోగతిం గూలుదురు. కావున నీ విట్టిబ్రదుకు బ్రదుకుటకంటె శరీరత్యాగంబుసేయుటే మేలని మఱియు నానాప్రకారంబులఁ బరుషాలాపంబు లాడు నరవరేణ్యుం గని యప్పరమపతివ్రత సభక్తివినయస్నేహ సంభాషణంబుల నిట్లనియె. 99

కం. తండ్రీ! నీవిటు నాపయి వేంద్రంబగు కినుకఁబూని వివిధంబులుగా
గండ్రిల్ పలుకుట చను నే? ఖండింపుము శిరము (నాదుకడఁ దప్పున్నన్)

తే. గీ. జనక ! నీవిట్టు లాడుట చనునె నాదు
గుణములెల్లను నరయక క్రూరమతిని ?
పల్లవుఁడు గాఁ డితం; డగు భార్గవుండు.
వలదు సంశయ మిఁక నీకు వసుమతీశ ! 101

వ. అని.

తే. గీ. అచటి కశ్వులు తోతెంచు టందుమీఁద
దివ్యమగు నొక్కకాసారతీరమునకు
చనుటయును నాజలంబుల స్నాతుఁడై సు
రూపుఁ డగుటయుఁ జెప్ప నబ్భూపుఁ డపుడు. 102

వ. సంశయవ్యాకులితమానసుండై యాసుకన్యకం గని యిట్లనియె. 103

తే. గీ. ఇంతి! అశ్వులు తోతెంచు టేడ? దివ్య
సరసి యది యేడ? ముదుసలిసంయమీంద్రుఁ
డేడ? అవగాహనము సల్పు టేడ? పూర్ణ
యౌవనుం డౌట యేడ? ఇట్లవనిఁ గలదె? 104

తే. గీ. ఇట్టివిపరీతవాక్యము లేర్పడంగ
చెప్పి యొప్పించఁజూచెదే చెలియ! నన్ను
అంకు నేర్చినవారలు బొంకనేర్తు
రనుచు విశ్వంభరాస్థలి నందు రెందు. 105

తే. గీ. బుధులు చెప్పెడువాక్యముల్ పొల్లు లగునె?
వీఁడు విటరాయఁడేచుమ్ము వేయునేల?
కాన విశ్వసనీయవు కావు నీవు
పాపమతి. వంచుఁ బల్కె నాపరమసాధ్వి. 106

వ. బద్ధాంజలియై పలువిధంబుల విన్నవించినను వినక యంతకంత కగ్గలంబగు కో (పంబునఁ గ) ర్ణకఠోరవాక్యంబులు పల్కె నందుల కులికి యత్తరుణీలలామంబు భయభ్రాంతయై యేమియు నన కూరకుండె. అంతఁ గొంతతడవున కమ్మునివరుండు వారల కెదురుగాఁ జని యమ్మూర్ధాభిషిక్తునకుఁ దన వృత్తాంతం బాద్యంతంబునుం దెలిపిన నెట్టకేల కాతండు ప్రసన్నుండై యమ్మునిశిఖామణికి నమస్కరించి తన పుత్రీమణి నెత్తి నిజాంకంబునఁ గూర్చుండఁబెట్టికొని మూర్ధాఘ్రాణంబుగావించి యోయమ్మ! నీసుగుణంబు లేఁ గానక విరసంబులు పల్కితి. అందుచే నీమనం బెంత కంది కుందెనోకదేయని యనేకవిధ సుధామధురోక్తులఁ గూఁతుం దేర్చి వెండియు జామాతం గాంచి యోమహాత్మా! నే నొక్కయాగం బొనరింప సంకల్పించుకొని భవత్సన్నిధానంబున కేతెంచితిఁ గావునఁ దత్క్రతువునకు యాజకత్వంబు వహించి సుప్రయోగంబు గావింపుమని పలువిధంబుల వేడి. 107

తే. గీ. కూఁతు జామాతలను గూడి కువలయేశుఁ
డరదమునఁ గూరుచుండి చయ్యనఁ బురంబు

చేరె నావేళ నిజపరివారసహితుఁ
డై ప్రమోదాంబునిధి నోలలాడుచుఁ గడు. 108

ఆ. వె. ఇట్లు పురవరమున కేతెంచి వారల
అర్హమందిరముల కనిపి రాజ
చంద్రుఁ డపు డమాత్యసంఘుంబునకుఁ జెప్పె
శిల్పివరుల కాజ్ఞసేయుఁ డనుచు. 109

సీ. వైదూర్యపర్వతప్రాంతంబునను మించు
నర్మదాతీర వినిర్మలోర్వి
కడను విశాలంబుగా శాస్త్రరీతిని
అనువొప్ప మఖశాల ఘనతమెఱయ
కట్టించి దానికిఁ జుట్టు బ్రహ్మక్షత్రి
యోరవ్యపాదజవారములకు
మణిమయాగారముల్ మంచిగ నిర్మింపఁ
జేయుఁడు నిఖిలార్థసిద్ధిగాఁగ.
పాకశాలలు మఱము లనేకవస్తు
పూరితాగారములు మఱి భోజనార్థ
సదనములు నాగహయరథసైన్యవాస
వేశ్మములుఁ గట్టఁబనుపుఁడు వేడుకలర. 110

ఆ. వె. చలువచప్పరములుఁ జలిపందిరులు నచ్చ
టచటఁ బెట్టఁబంపుఁ డఖిలవస్తు
వర్గములను విపణిమార్గంబులను నమ్మఁ
డనుచు వైశ్యజనుల కాజ్ఞయిడుఁడు. 111

వ. అని మఱియొక్కయమాత్యోత్తముం గని యిట్లనియె. 112

సీ. మినుములు గోదుమల్ (సెనగలు న)లచంద
(లన్యంబులగు) కాయధాన్యములును
రమ్యతండులములు రాశిగాఁ బోయింపు.
దధిమధుఘృతములు తఱుచు కూర్పు.
(కాయగూరలును) శర్కర ఫలమ్ములుగూడ
చాల నిప్పటినుండి సంగ్రహింపు

(చమసముల్ మొదలైన సకలపాత్రిలతోడ
యజ్ఞసాధనముల నమరిపింపు.)
వితరణార్హంబు (లును మఱి) శ్వేతఖురవి
రాజితములగు విమలహిరణ్యశృంగ
ములను దనరారునట్టి గోవులనుగూడ
వేగ (సిద్ధంబునేయుము) వేలకొలఁది. 113

ఉ. పౌరులఁ జుట్టలం జెలులఁ బ్రాజ్ఞుల భృత్యుల నిష్టకాంతలన్
వారక యాశ్రితావళుల బాడబులన్ మఱి మౌనివర్యులన్
కూరిమి (నస్మదీయకు) లగోత్రవరేణ్యుల వారిపత్నులన్
దారల పుత్రులన్ సఖులఁ బాయక యందఱ నిందుఁ దేఁదగున్. 114

కం. క్రతువునకై యేతెంచెడు
యతులకు నతిథులకు మఱి బుధాళికిఁ బూజల్
సతతము గావింపుము నీ
వతులశ్రద్ధాసహితుఁడవై (ధీసచివా !) 115

ఆ. వె. మఱియు స్రుక్స్రువాదిముఖ సాధనంబులు
సంగ్రహింపు మిపుడు సరవి బుత్వి
గాళి నిటకుఁ బిలువనంపుమా వేవేగ
వలయుపనుల కెల్ల వారి నిలుపు. 116

కం. అని పనుచుడు వారలు దన
అనుమతి గైకొనుచు మిగుల హర్షముతో న
ప్పను లెల్ల సంఘటించిన
కనుగొని రాజన్యుఁ డంతఁ గౌతుకమొప్పన్. 117

వ. ఉండుసమయంబునఁ గళింగ కాంభోజ కాశ్మీరాది దేశాధీశులును బులహ పులస్త్య
వసిష్ఠ వాలఖిల్య విశ్వామిత్రాత్రేయాంగిరస వామదేవాది తాపసజనంబులును మఱి
యనేకభూసురసంచయంబులు నొక్కుమ్మొగి నరుదేరె. అంత నారాజన్యుండు 118

శా. నానాభూములనుండి వచ్చు ధరణీనాథావళిన్ బంధులన్
మౌనివ్రాతములన్ ధరామరుల నేమంబొప్పఁగా నుజ్జ్వల
స్థానాభ్యంతరసీమలందు విడియించం బంచి భూకాంతుఁ డ
ప్డానందంబున మించె యాజకులు నెయ్యంబొప్పఁ గీర్తింపఁగన్. 119

వ. అప్పుడు. 120

ఇంకను నీక్షింపుఁడు.

సీ. వర్ణాశ్రమాచారవార్తయే యెఱుఁగని
ద్వీపాంతరస్థులు భూపులైరి.
ధర్మసూక్ష్మంబును దగ గ్రహింపఁగలేని
ధీరులు ధర్మాధికారులైరి.
పాశ్చాత్యనృపవేషభాషావలంబులై
వర్తించువార్ద్దేశవాసులైరి.
స్వకులాభిమానంబు చాలినంతగ లేక
వెనుకంజవేయువా ర్విప్రులైరి.
కాన నేమన్న సాగెడి కాలమయ్యె
స్వర్ణకృ చ్ఛర్మకృ న్మ్మఖ్య జనులకెల్ల.
ఏల సంకరు లనకుందు రింక వారు
బ్రాహ్మణులమని మిడికెడి వైదికులను. స్వ. తృ. భా. 48
తే. బ్రాహ్మ్యమన్నను దలనొప్పి బ్రాహ్మణులకు.
ఓందఁజూచుచునున్నవా రొరులు దాని.
బ్రాహ్మణుండయి పుట్టుటే ప్రథమకష్ట.
మందు వైదికుఁడై పుట్టు టధమ మిపుడు. 49

ఇట్లు ప్రభువుల దగ్గఱనుంచి పరామర్శించు పండితపత్రికాసంపాదకప్రభృతులు ప్రస్తావము వచ్చినప్పుడు పరులసంగతి పరిశీలించుటకు భయపడరు. కావునఁ గాపీహోటలు పెట్టుచున్నారనుటకే కట్టుదుము కొట్టుదుమని కడు గడబిడవెట్టు పిడుగురాళ్ళపుడమివేల్పు లీపై భూపాలకాదు లిఁక నన్నేమి చేయవలెనో యించుక యొఱిఁగింతురుగాక. లేదేని యేదో యైన దైనదని యాత్మీయాపద్ధత్య మణఁచుకొననైన నణఁచుకొందురుగాక. అణఁచుకొనక యస్మదుపరి యగపఱచునది యంతయు వ్యర్థమనియుఁ బిడుగురాళ్ళరిగ్యులేషనులు పెద్దమనుష్యులమీఁదఁ బ్రయోగించుట సుద్దిగాదనియు సూచించుచున్నవాఁడను.

సూచించుటయే కాదు. ఇట్టియర్థమే స్ఫురించునట్లెన్నఁడో యాదికాలము నాఁడే స్వస్త్రీయప్రేరితుఁడై తదుద్ధర్తుకామతం దంటాలుపడుచు నస్మత్పక్షు మణఁగఁ ద్రొక్కఁజూచు పిడుగురాళ్ళ సభాపతి సత్యనారాయణపేర జాబుగూడ వ్రాసినాఁడను. క్షమాపణయని దాని సర్వులకుఁ జదివి వినిపించుచుఁ జంకలుగొట్టుకొనుచున్నాఁడే కాని మహాపరాధము మత్కృతము, మన్నింపు మహారాజా యనియే యున్నదో కట్టుదుము కొట్టుదుమను ఘనులకుఁ గడుప్రీడ గలిగింపఁదగినదిగా నున్నదో గర్భితార్థమును గ్రహింపఁజాలఁడు. క్షమింపుమను నక్కరము లున్నవనియే యనుకొందను. ఎక్కడి దా క్షమాపణ ? సాధుసన్నిధిని. శ్లో. లుబ్ధ మర్థేన గృహ్ణీయాత్,

సాధు మంజలికర్మణా. అంజలి జోడించుటతోడనే యతఁ డభిమతమును పూరించును. ఇచట నేమైనది ? సపంక్తిభోజనాదివ్యవహారము నాతో జరుపవలదని సమీపగ్రామములకు సభాపతి పత్రికలు పంపెనఁట నిన్న పంపిన పత్రికలను నేఁడే ప్రతి పంపఁ గూడదఁట. ప్రత్యక్షముగనే పోయి నేను పాదములమీఁదఁ బడునాఁటికిఁ బర్యాలోచించునఁట నాజాబునకుఁ జెప్పిపంపిన జవాబిది. ఈపాకము వేఱు. కానిండు. పడవలసి వచ్చుచోఁ బడుదును. పత్రికగనుకఁ బ్రవృత్తి ప్రకటీకృతము.

—• స్యాలకుని పెండ్లికిఁగాఁ జినప్పయ్య నాతోఁ జెలిమిచేయుట •—

కథ కంచికిఁ బోయినది. రామాయణములోఁ బిడకలవేట్లాటవలెఁ జినప్పయ్య చరిత్రలోఁ జేబియ్యపుసోదరులు చేరవచ్చుటయు వారి చరిత్రమును వ్రాయవలసి వచ్చెను. ఇంతమాత్రమేకాదివ్వారి చరిత్ర. ఇంకను నెంతయో యున్నయది. కాని 'కథాపిఖిలు పాపానాం' ప్రకరణములోఁజేరిన కానిపోని ప్రసంగమగుట గ్రంథ విస్తరభీతిని గట్టిపెట్టి ప్రస్తుతాంశమును బరిగ్రహించుచున్నవాఁడను. ప్రస్తుతాంశము చినప్పయ్య బావమఱఁది పెండ్లి నిమిత్తము పరిపంథినైన నాతో సంధిఁజేసికొనుట. ఆ బావమఱఁదియే సోదరుల యందఱిలోను జ్యేష్ఠుఁడు. అతఁడు తలిదండ్రు లిరువురును దనువులు విడుచుటయుఁ దన పెండ్లి తానే చేసికొనవలసినవాఁడై యయ్యాది సులభ సాధ్యము గాక యబ్బములు కొన్ని గడపెను. అంతలో నదృష్టవశమునఁ బినతండ్రి తనువు విడుచుటయు నాయన యర్ధాంగి యాత్మానుకూల యగుటయు నావిడవద్ద నాఁడపిల్లలిరువు రుండుటయుఁ దటస్థించెను. అగ్రమైన యాపినతండ్రిభార్య యాత్మజను బదులిచ్చి యతనివివాహము చేయుట కనుమతించుటయు బదులుపిల్లకొఱకు బావయుఁ దానును బర్యాలోచించుచు నాసమయమం దస్మత్పరిపాల్యమానయై యలరు నాఁడుపిల్లపై నక్షులు వఱపిరి.

ఆపిల్ల యస్మ ద్దాద్యపత్ని మేనమామకూఁతురు. మేనమామయు నాయన జాయయే యైన మేనయత్తయుఁ బదిపండ్రెండుదినములు వెనుకముందుగాఁ బరలోకగతులగుటయు వయసుచెల్లిన వారి తల్లి తత్సంతానచతుష్టయమును సాఁకలేక బిడ్డబిడ్డయైన నా పెండ్లమును బిలిచి పెంచి పెద్దఁజేయుమని యాఁడుబిడ్డ నొకరితె నంటగట్టెను. అంతకును నత్యల్పకాలముననే యాపెండ్లము నాత్మజుఁడు మమ్ము వ్యధాసాగరమున ముంచిపోవుటచే వానికి మాఱుగా దీనిని బెంచఁగడఁగితిమి. వాని చొక్కా లిది తొడిగెను. వాని లాగు లిది కట్టెను. వాని చెప్పు లిది మెట్టెను. పెక్కేల ? వాఁడే యిదియై మూఁడునాలుగేండ్లు ముద్దులు చూపుటయు నింతలోఁ బెండ్లియీడు నేతెంచెను. యుక్తవరు నన్వేషించి యుద్వాహ మొనరింతమని యువ్విళ్ళూరితిమి. కాని దాని బదులిచ్చినఁ గాని తదగ్రజు వివాహము కానేరదని తదీయులు తమ యభిప్రాయము నివేదించిరి. చివరకు బావమఱఁదికి భవితవ్యయైన బదులుపిల్లఁగాఁ జినప్పయ్య కనుగొనియెను. ప్రప్రథమము బావమఱఁది ద్వారమునఁ నన్నుఁ బ్రశ్నించెను. అంతమాత్రమున నవ్వాంఛిత మీడేఱమి నాలోచించెను. ఆద్యపత్నియు నేనును నద్దాని పుట్టింటి కరుగుసమయము నన్వేషించెను. దానితండ్రి దీనికి మేనమామ. తల్లి మేనయత్త. మేనయత్త పెత్తల్లి. అంతయుఁ బీరకాయపీఁచు. అప్పటి కేనును

నాకీఁమలోనే ధైర్యమైయుంటఁ బీచఁతయుఁ దనవేసికొని నా యత్తగారియూరైన వేసుఁరములో షి. సియుండుట విని వీఁడు (చినప్పయ్య) విచ్ఛేయుటయు వేళకు వివాహము కావలెనపిల్ల యక్కమగఁడు కొత్త సుబ్బయ్యయుఁ జొత్తెంచెను. అవ్వారందఱు నదివఱకే సుప్పయ్యచే నర్థింపఁబడి బదులిచ్చుట కంగీకరించియుఁ దత్కాల సంరక్షకుఁడనగు నాతలపైననే తత్కన్యావరనిశ్చయభారము నుంచియుండిరి. ఇష్టుఁడైన వరున కెవనికో యిచ్చి యేనుదినములు వివాహము చేయుట కే నిచ్ఛయించియుంటిని. అస్మత్క్రియమాణ తత్కార్య మన్న యప్పయ్య యగ్రాసనాధిపత్యముతో నలరార వలసియుండెను. అట్టి నన్నాపిల్ల మేనమామయాదిగాఁ గలుగు నందఱి యాలోచనతోను జినప్పయ్య చేరవచ్చి చిన్నగాఁ బ్రస్తావించెను.

అట్లాచినప్పయ్య యందఱిముందఱ నస్మ దంగీకృతి నర్థించుటయు నిందఱి కిష్టమైన యిక్కార్య మే నొక్కఁడ నాపిన నాఁగదని యంగీకరించుచు నస్మద్భ్రాత యప్పయ్యయుఁ జినప్పయ్యయు నన్యోన్యము శత్రువులు కావున శత్రువు బావమఱది కిచ్చి చేయు పెండ్లికి జ్యేష్ఠభ్రాత రాఁడనియు నాయన రాకుండ నణుమాత్రకార్యము నే నాచరింపననియు నంటిని. అందుపై నందఱును వివాహవ్యయ మీవు భరించి భవద్గృహమునఁ బచరింపకున్నను నీమనువున కిష్టపడినఁ జాలునని యెట్లో నాచేఁ దథాస్తనిపించిరి. ఇంతబలవంత పెట్టుటకు వీరిలో వేరును వేఱుమనువువిచారించు ధీరులు గాకునికిని గాని యీయనయే మన్మథవిగ్రహమని యెద సెంచి కాదు. అంత నాసన్న వివాహాయగు నబ్బాలిక మనతో నేలయని యక్కడనే వదలిపెట్టి యవిముక్తక్షేత్ర యాత్ర నాచరింపనున్న దంపతుల మిరువురము దద్గ్రామమునుండి మాగ్రామమునకు మరలివచ్చితిమి. కాశికిం బ్రయాణము గావించితిమి. కాని యకస్మాదాగతాస్మదామయ నివృత్తికేఁగా నౌషధసేవఁ జేయుచుఁ గొంతకాలము గుంటూరున నుండవలసివచ్చెను. పెరబంధుగులచేఁ బెండ్లిప్రయత్నము చేయఁబడియెను. పిల్లపున్నను బిల్లను బెంచిన మమకారముచే నేమే యేగితిమి. అరిగిన తరువాతమాత్రము నందఱు నాదరముఁ జూపిరి. చినప్పయ్య స్నేహితుఁడే యైపోయెను. వేయేల? అది మొదలుకొని యన్నింటికి నాలోచనకర్తయే యతఁడయ్యెను. కన్యాదానము నాచేతనే కావింపించెను. తావన్మాత్రవ్యయమైనను దలఁదాల్పక దానముచేయుట తగవుకాదని కాసో వీసమో ఖర్చు భరించి కన్యాదానము గావించితిని. అయ్యది యస్మదగ్రజున కనభిమతము. అందువలన నే యదిమొదలు మనసిచ్చి మాటాడఁడు. అప్పుడే యవిముక్తక్షేత్రయాత్రయు నస్మదాచరితము. నాతియు నేనును నాలుగునెలలు యాత్రలాచరించుచు పరిశుప్పలు నుతపింపుట మొదలగువానిఁగూర్చి మనసిచ్చిమాటాడని మద్భ్రాతకుఁ గాక పెంపుడుబిడ్డ పెనిమిటికని ప్రియుఁడైన చినప్పయ్యకును గమ్మ వ్రాసితిని. తత్పూర్వము తానే చేయించుచాఁడగుట నన్నయే యాపనులు చేయింప యత్నించుచుండుటయు నప్పుడప్పుడే తలవెళ్ళఁబెట్టుచున్న చినప్పయ్య జ్యేష్ఠుఁడును జినప్పయ్యయు నగ్రజునకును నాకును గలిగియున్న యణుమాత్రభేదభావమునే యభివృద్ధిచేయుటకుఁగా నస్మల్లిఖిత లేఖఁ గనఁబఱచి యపలఁదఱచిరి. అట్లు క్రమక్రమముగా నాయనకును నాకును గల యన్యోన్యప్రేమ నంతరింపఁజేయుచుఁ దండ్రికొడుకు లిరువురు బద్ధస్నేహులవలెఁ బ్రవర్తిల్లిరి.

తప్పేరితుఁడనై తత్తత్కార్యములలో భ్రాత కపకారముఁగూడఁ బచరించితిని. ఆయనకుఁ జేయించుటయే కాక స్నేహితులు గానుండి నాకును నపకారము గావించిరి. ఆంతరంగికస్నేహితులను భావముతో ననేకులు ప్రబోధించినను నపకారములని యను కొనక నాపనులు నేనే చెఱచుకొంటిని. వీండ్రు పడమటిమిద్దె గూనలు రెండు మా వాకిటిలోకిఁ బెట్టుటకు మాతండ్రి యెన్నఁడో సమ్మతించెను. పదపడి కొన్నాళ్ళకుఁ బడమటిమిద్దెమీఁదివే కాక వంటమిద్దెలువేసి వానిమీఁదినీళ్ళును వచ్చి మావాకిటిలోనే పడునట్లు కావించిరి. అటుతరువాత నామిద్దె లన్న సుబ్బయ్యభాగమునఁ బోవుటయుఁ గొంతకాలము కూలిపోయియే యుండెను. క్రమ్మఱఁగ్రయించికొని వానినే వీరు కట్టించిరి. ఆకట్టించుటలో మునుపటివలె వంటమిద్దెదగ్గఱనుంచియే కాక దాని కావలనున్న తమ స్థల మంతటను మిద్దెవేసి యక్కడినుండి వచ్చు నీళ్ళతోఁగూడ నస్మద్గృహము ముందఱ వచ్చి పడున ట్లాచరించిరి. అప్పు డాటంకపెట్టుమని యనేకులు చెప్పిరికాని చినప్పయ్యతోడి చెలిమి చేయనిచ్చినది కాదు. అన్నకన్న నతఁడే యత్మాప్తుఁడని యనుకొంటిని. పెంటమన్నుఁ బోసికొనుటకుఁగూడ బెత్తెఁడు స్థలము లేక యింటిముం దఱనే పోసికొనుచు నెక్కడనేని యింత స్థల మిప్పింపుఁడని యవ్వారినే యాశ్ర యించితిని. వారును నక్కడక్కడ నారయుచుండిరి. ఆసంగతి విని యాతు కూరి వెంకన్న యను నర్యుఁ డస్మదంతికమున కరుదెంచి యాత్మీయమైన దొడ్డి 60 రూపాయల కిత్తుఁ గొనుమనియెను. అది నా యింటికంటెను జినప్పయ్యయింటికే చేరువ నున్నయది. కనుక నే క్రయించుకొనుటకు వారు కాచియుండిరి. కాని యంతయో యింతయో యతనికిఁ బెట్టిన యప్పే ప్రతిఫలముగా హరింపనుండుటయు విదిత తదభిప్రాయుఁడై వెంకన్న వేఱుతోనను నెళ్ళఁదలఁచెను. నేను మైత్రి చెడు నని మావాండ్రకే యిమ్మంటిని. పరకయో పాతికయో యైన ప్రాఁతబాకీక్రింద బహుమూల్యమయిన దొడ్డిని బ్రాహ్మణుఁడు బలిమిమై హరింపనున్నవాఁడుగాన నాయన కీయననియు నీవు తీసికొనకున్న నేరికేని యీనంటిననియు వెంకన్న వివరించుటయు మంచిదని యేనే సంచకరు విచ్చితిని. విక్రయపత్రమును రిజిస్టరు చేయించుకొనుటకు వెళ్ళుచుంటిని. ఇంతలో నెచ్చటినుండియో వచ్చి చినప్పయ్య జ్యేష్ఠుఁడు దొడ్డి మాకే యీకున్న నీ కేవిపత్తో తెచ్చిపెట్టెదనని యెంతయు భయపెట్టుటయు వెంకన్న వంకర త్రోవ పట్టెను. పెంటదిబ్బకు స్థలములేక పెక్కుతంటాలు పడుచుంటినిగాన నిప్పింపు మురా యీస్థలము నాకని యెంత చెప్పుకొన్నను జినప్పయ్యజ్యేష్ఠుఁడు కనికరింపక పెంటకు నీకు లేకుంటే నింటికి మాకు లేదు కావున నెవరియక్కఱ వారిదే యేగుమని యెను. ఇక్కడి కీతని హితవర్తన మెఱుఁగనయ్యెను. విశ్వప్రయత్నము చేసినను వెంకన్నకూడ వశుఁడు కాకపోయెను. తరువాత దావావేసి వేరికిని విక్రయింపకుండ నీదొడ్డి కింజంక్షను చేయించితిని. చినప్పయ్య జ్యేష్ఠునిచరిత మెఱుఁగనివాడుంబోలె నీస్వల్పవిషయమున కింతపనిచేయవలెనా యనియుఁ బెదనాయనకటరా మన పైపోటి యని పిల్లవానిఁ గోపగించితి ననియుఁ బెక్కులు చెప్పియుఁ జెప్పినట్లు చేయక చెడు గు నే చేయఁగడఁగుటయుఁ జీయనిపించి జిహ్మగస్నేహసదృశమగు చినప్పయ్యతోడి సఖ్యమును జిన్నగా జాఱవిడిచితిని.

హితముం గోరి యన్యోన్యమున నశింపం జేసికొనుచు దిర్యగ్యోని
గతంబులై యీలోకమందు సంచరించుచుండు వీనికి మూడువేల
కల్పము లొకరాత్రియు నట్లే పవలు నగుచుండు నింద్రియప్రేరణ
మున మనం బెల్లెడం దిరుగుచుండు మనస్సహాయము లేని యింద్రి
యములు విషయంబులం గాంచ మన స్సుపరమించిననింద్రియంబు
లుపరమించుం గావున మనస్సింద్రియంబుల కీశ్వరం బోజనకా!
తత్త్వసర్గసంఖ్యయుం గాలసంఖ్యయుం దెల్పితి నింక నుపసంహారం
బునుం దెల్పెద నాకర్ణింపుము.

తే. అక్షరుండును నిత్యుం డనాదినిధనుం
డవ్యయుం డగుబ్రహ్మ యీప్రాణిసమితి
మఱియు మఱియును సృష్టించి మఱియు మఱియుం
బొడవడంగించు విధము నేర్పడంగ వినుము.

సీ. పగలు క్షయించి రే యగుదేర నతండు ని
దురవోం దలంప భూతపరికరముల
నవ్యక్తుం డీశుం డహంకృతుం బ్రేరించు
నపుడు సహస్రాంశుం డతులితగతి
ద్వాదశాత్ముం డయి ప్రజ్వలించుడు జతు
ర్విధజంతుజాలము వేంగిపోవుం
గూర్మపృష్ఠము వోలెం గుతలము జలమధ్య
మునం దేటం గాలాగ్ని పొడమి మేటి

తే. నీటి నిగిరించు నంతట నీటిజాత
యష్టరూపములం బుట్టి యగ్ని మ్రింగి
తిర్యగూర్ధ్వాదిగతుం డయి తేజరిల్ల
దాని మ్రింగు నాకాశము వూని పట్టి.

—♦ అధ్యాత్మాది భూతాధిదైవతపరికారము ♦—

వ. అయ్యాకాశమును మనస్సు ద్రింగు మనస్సు నహంకార ప్రజాపతి మ్రింగు నహంకారమును మహత్తు మ్రింగు నామహత్తు నణిమాదిసిద్ధులు గలశంభుండు మ్రింగు నశం డంతట ను బాణిపాదశిరోక్షిముఖశ్రవణంబులు గలిగి సర్వము నావరించి సర్వభూతాత్మభూతహృదయభూతుండై యంగుష్ఠమాత్రుం డయి యుండియుఁ బరమేశ్వరుం డయి జగమెల్ల మ్రింగు నవ్వల నవ్వ యము నక్షర మగుపరబ్రహ్మమే మిగిలి యుండు నిది విలయక్రమం బింక నధ్యాత్మము నధిభూతము నధిదైవతము ననువానిం దె లిపెద విను మని యాజ్ఞవల్క్యుం డు వెండియు నోజనకా! పాద ము లధ్యాత్మము గంతవ్య మధిభూతము విష్ణుఁ డధిదైవత మల్లె పాయు నధ్యాత్మము విసర్గ మధిభూతము మిత్రుఁడధిదైవత ముపస్థ మధ్యాత్మ మానంద మధిభూతము ప్రజాపతి యధిదైవతము హ స్తము లధ్యాత్మము కర్తవ్య మధిభూత మింద్రుఁ డధిదైవతము వా క్కధ్యాత్మ మవ్యక్తి మధిభూతము వహ్ని యధిదైవతము చక్షుఁ వధ్యాత్మము రూప మధిభూతము సూర్యుఁ డధిదైవతము శ్రోత్ర మధ్యాత్మముశబ్ద మధిభూతము దిక్కు లధిదైవతముజిహ్వ యధ్యాత్మము రస మధిభూత ముదకమధిదైవతము ఘ్రాణమధ్యా త్మము గంధ మధిభూతము పృథివి యధిదైవతము త్వ క్కధ్యా త్మము స్పర్శ మధిభూతము పవన మధిదైవతము మన మధ్యాత్మ ము మంతవ్య మధిభూతము చంద్రముఁ డధిదైవత మహంకారిక మధ్యాత్మ మభిమాన మధిభూతము బుద్ధి యధిదైవతము బుద్ధి యధ్యాత్మము బోద్ధవ్య మధిభూతము క్షేత్రజ్ఞుఁ డధిదైవత మిది యాదిమధ్యాంతములం గూడినవిభూతియోగం బని మఱియును.

క. ప్రకృతిగుణంబుల కెన్నే
వికారములు గల్గఁ జేయు వేడుకతో ని

ట్లు కలుగఁ జేయుట లెన్నం
బ్రకృతికి సూక్ష్మక్రీడ యనుచుఁ బరికింప నగున్.

మ. ఒకదీపంబుననుండి లోకమున నెన్నో దీపము ల్మానవుల్
సకలప్రాంతములందుఁ బొందుపడి వెల్గం జేయుచందంబునన్
బ్రకటప్రాభవ మేర్పడన్ గుణములన్ స్వచ్ఛందకార్యంబులన్
వికృతుల్ పెక్కులు గల్గఁ గాఁ బ్రకృతి గావించున్ విచిత్రంబుగన్.

వ. గుణంబులు సత్త్వరజస్తమోంచితంబులు చెప్పెద వినుము సత్త్వ మా
నంద మున్ద్రేకము ప్రీతి ప్రాకాశ్యము సుఖము శుద్ధత్వ మారో
గ్యము సంతోషము శ్రద్ధ యకార్పణ్య మసంరంభము క్షమ ధృతి
యహింస సమత్వము సత్య మానృణ్యము మార్దవము హ్రీయు
నచాపలము శౌచ మార్జవ మాచార మలౌల్య మసంభ్రమ
మిష్టానిష్టయోగంబుల నవికల్పనము నస్పృహత పరార్థత సర్వభూత
దయ యనునివి సత్త్వగుణంబులు రూపము నైశ్వర్యము కలహము
నత్యాగిత్వము నకారుణ్యము సుఖదుఃఖోపసేవనము పరాపవాదరతి
వివాదప్రియము నహంకారము నసత్కారచింత వైరోపసేవనము
పరితాపము స్తైన్యము హ్రీనాశనము ననార్జవము భేదము పరు
షత కామము క్రోధము మదము దర్పము ద్వేషము వాదము నను
నివి రజోగుణంబులు మోహ మప్రకాశము క్రోధ మనుతామిస్రము
మరణము ననుసంధితామిస్రము సర్వపదార్థభక్షణేచ్ఛ భోజనావ
ర్యాప్తి పేయాతృప్తి గంధవాసోవిహార శయనాసనాతృప్తి దివాస్వ
ప్నము నతివాదము ప్రమాణము ననిష్టము నృత్యవాదిత్రగీత ప్రియ
త్వము ధర్మద్వేషము నను నివి తమోగుణంబు లని మఱియును.

సీ. ఈమూఁడు ప్రకృతికి నెసఁగుగుణంబులు
జగము సంబంధించి చనియెడు నివి

యవ్యక్తరూపుఁడు సువ్యక్తముగఁ జేయు
గోటానఁగోట్లుగా మేటిరూపు
లధ్యాత్మచింతకు లత్యుత్తమము సాత్వి
కస్థాన మని రజఃకలిత మయిన
స్థానము మధ్యమం బై నెగడొందెడు
నని తమస్స్థాన మత్యధమ మనియుఁ

తే. జెప్పుదురు ప్రాణిపుణ్యముచేత నూర్ధ్వ
గతియుఁ బుణ్యపాపములసంగతిని మర్త్య
మును నధర్మమునంజేసి కన నధోగ
తియును బొందెడు నని బుధుల్ తెలుపుచుందురు.

వ. మఱియు నీగుణంబులు రెండు మూఁడునుం గలియుచుండు నెట్లనిన రజము సత్వము తోడను దమము రజస్సుతోడను సత్వము తమంబుతోడనుం గలియుచుండును మూఁడును సమత్వము నొందుటయును జూపట్టు నపు డవి యవ్యక్తం బగు ప్రకృతి యగు నవ్యక్తుఁడు సత్వమాత్రయుతుండై దేవలోకంబును రజస్సత్వసమాయుక్తుండై మనుష్యత్వమును రజస్తమోయుతుండై తిర్యగ్యోనిత్వమును బొందుచుండు మఱియు నొకప్పుడు సత్వరజస్తమోగుణసహితుండై మనుష్యుండై పుట్టు బుణ్యపాపరహితుఁ డవ్యయము శాశ్వత మక్షయ మమృత మగుస్థానము లభించు నని చెప్పుదురు.

క. జ్ఞానులపుట్టువ నుత్తమ
మైనది మఱి వారిస్థాన మది యచ్యుత మ
జ్ఞానవిరహిత మతీంద్రియ
మై నెగడుం జావుపుట్టు లవి లేనిదియై.

తే. పరము నడిగితి వాతఁ డవ్యక్తుఁ డయ్యు
బ్రకృతి గతుఁడౌటఁ దనప్రభావమున నుండుఁ

ప్రకృతియు నచేతనం బయ్యుఁ బరము నాశ్ర
యించి సృష్టిలయములు గావించుచుండు.

వ. అనిన జనకుండు ప్రకృతిపురుషు లనాదినిధను లమూర్తిమంతు
లచలు లదృష్టగోచరు లందొకఁ డచేతనత్వము నొందుటయు నొకఁ
డుచేతనముగల్గి క్షేత్రజ్ఞుఁ డగుటయు నెట్టిది నీవుమోక్షధర్మవేత్తవు
నేను జిజ్ఞాసువును గావున నాకుఁ బురుషుని తత్త్వరాహిత్యమును
గేవలత్వమును ప్రకృతిభిన్నత్వమును దేహాశ్రితదేవతలను దేహి
దేహమున్విడిచి చనుప్రదేశమును జేరుకొనుస్థానంబును సాంఖ్యయో
గజ్ఞానంబును నరిష్టాదులుం దెలుపు మివి యెల్ల నీకుఁ గరతలామల
కంబు లనిన యాజ్ఞవల్క్యుం డి ట్లనియె.

సీ. గుణములు లేనప్డు గుణములు గల వనఁ
గుదురునె సగుణనిర్గుణములగతి
దెలిపెదఁ దత్త్వవేత్తలు పూరుషునకు గు
ణములసంగతి గుణిత్వము నసంగ
తిన్ నిర్గుణత్వముఁ దెలుపుదు రవ్యక్త
ము గుణస్వభావముం దగిలెడునది
గావున గుణములఁ గడచన నేర ద
జ్ఞ మచేతనం జయి చనుఁబురుషుఁడు

తే. తెలిసినట్టేడు నాకంటెఁ గలుగ డొక్కఁ
డనుచు నభిమాన మొందెడు నకుశుఁ డయి
చేతనుం డయ్యె నజ్ఞతచే గుణ ములఁ
వడక త న్నెఱుంగక ముక్తిఁ బడయఁ బోఁడు.

వ. మఱియు నప్పురుషుండు సర్గకర్తృత్వమ్మున సర్గధర్ముం డనియు
యోగకర్తృత్వమ్మున యోగధర్ముం డనియుఁ బ్రకృతికర్తృత్వమ్మునఁ

బ్రకృతిధర్మం డనియు బీజకర్తృత్వంబున బీజధర్మం డనియుఁ గుణప్రసవమ్మునఁ బ్రసవధర్మం డనియుఁ బ్రలయకారకుం డగుటఁ బ్రలయధర్మం డనియు నుపేక్షించువాఁడు ననన్యుఁడు నభిమాని యగుటంజేసి కేవలుం డనియుఁ జెప్పంబడుచుండు నాతని యతులు సిద్ధులు నధ్యాత్మజ్ఞులు శోకరహితులు నగువా రద్వయుఁడు నిత్యుఁ డవ్యక్తుఁడు వ్యక్తుఁడు నగు నని తెలుపుదురు. జ్ఞానాశ్రితులు ప్రకృతి కేకత్వమును బురుషునకు నానాత్వమునుం జెప్పుదురు. పురుషుండు ప్రకృతిభిన్నుం డైనను ముంజేషీకలకును మశకోదుంబరములకును మత్స్యోదకంబులకునుం బోలె సంయోగంబున భేదంబేర్పడకుండు మఱియు నగ్న్యుఖలకును జలపుష్కరంబులకును బోలె వానిసంబంధము గలిగి యుండు నిట్లు తెలియనివారు నిరయంబునం బడుదు రిది యుత్తమ పరిసంఖ్యాన మగుసాంఖ్యదర్శన మింక యథాశ్రుతము యథాదృష్టముగ యోగానుదర్శనం బెఱింగించెద నని మఱియును.

ఆ. సాంఖ్యమునకుఁ జాలుజ్ఞానము యోగము
నకును జాలుబలము నలువుపడదు
రెండు నొక్కచర్య నుండెడు నని విధ
నంబు నొందనివ యనంగ వచ్చు.

సీ. వాని వేఱుగ బుద్ధిహీనులు చూతురు
మే మొక్కటిగఁ జూతు మోమహీశ
యోగసాంఖ్యమ్ముల నొకటి గాఁ గనువాఁడు
తత్త్వవేత్త యనంగఁ దనరుచుండు
రుద్రప్రధానముల్ రూఢికెక్కుం గొన్ని
యోగము లవి నేర్చి యున్నవారు
తమదేహములతోడ [illegible]గుచు
నణిమాదిసిద్ధుల నందఁ గలిగి

శ్రీరస్తు.

శ్రీరాధాకృష్ణాభ్యాంనమః

శ్రీశ్రీజయపురముమహారాజా శ్రీవిక్రమదేవవర్మమహారాజులుంగారు 2—4—37వతేదీని మెయిలులో మదరాసుపురమునకు విచ్చేయుచు దారిలో విలాసముగా రచించి దర్శనమునకుఁబోయిన మాకు దయచేయించినపద్యము.

సీ. అతిపూతమూర్తికి నభిషేక మేలొకో
దిగ్వసనున కేల దివ్యపటము
యజ్ఞసంహర్తకు యజ్ఞసూత్రం బేల
నగ లేల భిక్షువునకుఁ దలంప
భస్మధరున కేల పరిమళగంధంబు
వ్యోమకేశున కేల పుష్పచయము
వరధూపము శ్మశానవాసున కేలొకో
యినవహ్నిశశిదృష్టి కేల దివ్వె
తే. గరళఖాద్యునకు సుమృష్టఖాద్య మేల
కానఁ బూజాపదార్థసంగ్రహణవాంఛ
మాని నిజచిత్తకంజ మీశానపాద
యుగమునందు నర్పింపుఁ డో యోగులార.

—·—

5 శాంతముగామాటలాడు

(అయినాపురపు సుందరామయ్యగారు)

తే. గీ. అడలుబెట్టుచు వసముకై । యడరుకంటె
చనువుచూపించి వలఁతికి । గొనుటమేలు

కఠినమాటలచేత జి । క్కని యతండు
తీపిమాటలచేత స్వా । ధీనుఁడగును.

తే. గీ. నెమ్మనెమ్మదిగాగల్గు । నేస్త మెపుడు
ఎడతెగని నీటివెల్లువ । వడుపునండు
అతిరహస్యమై చెప్పుట । కలవిగాని
సంగతులుకూడతనిచేవి । నంగవచ్చు.

తే. గీ. ప్రేమపిల్లదిక్కుచూ । పించినేని
యెట్టికార్యమునైన చే । యించవచ్చు
మఱతురాప్రేమ వారలు । తఱచుగాను
మంచినుడులచే మరల లా । లించవలయు.

తే. గీ. అలుకు సైగచలరనేఁడి । తలఁపుచేత
శాంతమును దప్పి మసలకు । జవ్వనులెడ
జాగ్రత ! విచారములకు నా ! స్థానమైన
జన్మమెప్పుడు జరుగనీ । సంతసముగ.

తే. గీ. వయసుగడచినవారిని । వగచునట్టి
పలుకులాడకు, మేలైన ! పలుకులాడు
బుద్బుదప్రాయమైన నీ । పుట్టువునకు
తరలిపోనిమ్ము, తాల్మితో । యరతితోడ.

తే. గీ. సరిగదయ తోటిశాంతరస । సంబులోలుక
నాదరంబగుమాటల । బీదవారి
నాదరింపుము కఠినోక్తు । లాడఁబోకు
సైచగలరని చూడకు నీ చులుగను

తే. గీ. తప్పుచేసినవారిని । తాల్మితోడ
మందలించినటద్దుక । మరలజేయ
రొక్కవేళనుజేసిన । నొక్కితిరుగ
నోర్పుతో హెచ్చరించి నా । నర్పరెపుడు.